Published from
Telangana and Andhra Pradesh

PRGI NO.TELTEL/2010/33275

ఎడిటర్- కలకొండ రామకృష్ణ

ప్రజా కలం

PRAJA KALAM Telugu Daily జాతీయ దినపత్రిక

Digital Editions : www.prajakalam.in., epaper.prajakalam.in , www.magzter.com, www.paperboy.com

బుధవారం | 11-11- 2026 | సంపుటి: 17, సంచిక: 221, పేజీలు: 12, వెల: 3/-



ఈ నెలలోనే నామినేటెడ్

పోస్టుల భర్తీ

'సర్'కు వ్యతిరేకంగా ఢిల్లీ తరహాలో

హైదరాబాద్‌లో భారీ సభ

న్యూఢిల్లీ, నవంబరు 10: రాష్ట్రంలో నామినేటెడ్ పోస్టుల భర్తీ ప్రక్రియను ఈ నెలలోనే పూర్తి చేస్తామని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ వెల్లడించారు. సర్, సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌లకు వ్యతిరేకంగా ఢిల్లీ రాంలీలా మైదాన్‌లో ఇటీవల చేపట్టిన ర్యాలీ తరహాలో.. సర్‌కు వ్యతిరేకంగా హైదరాబాద్‌లోనూ భారీ సభ నిర్వహిస్తామని పేర్కొన్నారు. లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని ఢిల్లీలోని ఆయన నివాసంలో మహేశ్ గౌడ్ మంగళవారం కలిశారు. హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో ఈ నెల 12-14 తేదీల్లో నిర్వహించనున్న 'భారత్ సమ్మిట్-2026'కు రాహుల్‌ను ఆహ్వానించారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ చేవడుతున్న వివిధ కార్యక్రమాలపై నివేదికను సమర్పించారు.

తరువాయి 2వ పేజీలో...

వచ్చే ముప్పై ఏళ్లు తెలంగాణ భవిష్యత్తు

మీ చేతుల్లోనే..

ప్రొబేషనరీ డీఎస్పీలతో ముఖాముఖిలో సీఎం రేవంత్‌రెడ్డి

సంక్లిష్టమైన పరిస్థితుల్లో డీఎస్పీల నియామకం చేపట్టాం..

నోటిఫికేషన్ నుంచి నియామకాల వరకు ఈ ప్రభుత్వమే పూర్తి చేసింది..

2011లో గ్రూప్-1 నియామకాలు చేపట్టారు.. ఆ తర్వాత 2025 వరకు దాదాపు 13 ఏళ్లు తెలంగాణలో గ్రూప్-1 నియామకాలు చేపట్టలేదు..

కొన్ని నెలలు ఆలస్యమైతేనే ఏళ్లు కోల్పోయామన్న బాధ అనిపిస్తుంది : సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్, నవంబరు 10 (ప్రజాకలం) : పోలీసు అధికారం అంటే కేవలం హోదా కాదు.. అది ప్రజలకు భరోసా కల్పించాల్సిన బాధ్యత! యూనిఫాం అంటే కేవలం గుర్తింపు కాదు.. అది ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రజలకు ఉన్న నమ్మకానికి ప్రతీక! పదవులు పొందడం గొప్ప కాదు.. ఆ పదవులకు న్యాయం చేస్తూ ప్రజల గుండెల్లో గౌరవం సంపాదించడమే అసలైన విజయం!!

తరువాయి 2వ పేజీలో...

కృష్ణా జలాల్లో తెలంగాణకు

న్యాయమైన వాటా సాధించాలి

సుప్రీంకోర్టులో బలమైన వాదనలు వినిపించాలి

డిండి, అచ్చంపేట పనులు వేగవంతం చేయాలి

నీటిపారుదల శాఖ సమీక్షలో అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు



హైదరాబాద్, నవంబరు 10 (ప్రజాకలం) : కృష్ణా జలాల వంపిణీలో తెలంగాణకు దక్కాల్సిన న్యాయమైన వాటాను సాధించేందుకు సుప్రీంకోర్టులో సమర్థవంతమైన వాదనలు వినిపించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆంధ్రప్రదేశ్‌తో నెలకొన్న జలవివాదాలకు సంబంధించి అన్ని అంశాలపై సమగ్ర ఆధారాలను న్యాయస్థానానికి సమర్పించాలని సూచించారు. ఈ నెల 18వ తేదీ తర్వాత సుప్రీంకోర్టులో కేసు విచారణకు రానున్న నేపథ్యంలో న్యాయ నిపుణులతో ముఖ్యమంత్రి ప్రత్యేకంగా చర్చించారు. ఎంసీఆర్ హెచ్ఆర్ డీలోని బోధి పెవిలియన్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నీటిపారుదల శాఖపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణా జలాల వివాదం, రాష్ట్రంలో కొనసాగుతున్న సాగునీటి ప్రాజెక్టుల పనులు, భవిష్యత్తు కార్యాచరణపై అధికారులతో చర్చించారు. సమావేశంలో నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, నీటిపారుదల సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, సీఎంఓ కార్యదర్శి మాణిక్ రాజ్,

తరువాయి 2వ పేజీలో...

అండాల సేకరణ అక్రమ దందాపై

సర్కారు ఉక్కుపాదం!

రాష్ట్రవ్యాప్తంగా 44 ఏఆర్టీ కేంద్రాలకు గాను 27 కేంద్రాల్లో తనిఖీలు

ఏడు ఆసుపత్రుల్లో 13 నిబంధనల ఉల్లంఘనలు గుర్తింపు.. షోకాజ్ నోటీసులు జారీ

31 మంది మహిళల గుర్తింపు.. వైద్యులు, ఐవీఎఫ్ కేంద్రాలు, మధ్యవర్తుల పాత్రపై విచారణ



హైదరాబాద్, నవంబరు 10 (ప్రజాకలం) : అండాల సేకరణ ముసుగులో జరుగుతున్న అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న సంస్థలు, వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి శ్రీ దామోదర రాజనర్సింహ ఆదేశించారు. మంత్రి ఆదేశాల మేరకు వైద్య ఆరోగ్య శాఖ రాష్ట్రవ్యాప్తంగా ఐవీఎఫ్ కేంద్రాలపై ముమ్మర తనిఖీలు చేపట్టింది. రాష్ట్రంలో గుర్తించిన మొత్తం 44 ఏఆర్టీ కేంద్రాలకు గాను ఇప్పటివరకు 27 కేంద్రాల్లో వైద్య అధికారులు తనిఖీలు పూర్తి చేశారు. ఈ తనిఖీల్లో ఏడు ఆసుపత్రుల్లో 13 నిబంధనల ఉల్లంఘనలను గుర్తించారు.

తరువాయి 2వ పేజీలో...

గాంధీ కుటుంబం కోసం

ఖజానా ఖాళీ చేస్తారా?

హామీలకు లేవని రాహుల్ సభల కోసం కోట్లు కుమ్మరిస్తారా?
బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు



హైదరాబాద్, నవంబరు 10 (ప్రజాకలం) : ఎన్నికల హామీలను గాలికొదిలేసిన రేవంత్ సర్కార్, తెలంగాణ ప్రజల సొమ్ముతో రాహుల్ గాంధీని మళ్లీ పొలిటికల్ స్క్రీన్ మీద నిలబెట్టేందుకు తాపత్రయపడుతున్నదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు మండిపడ్డారు. ఎన్నిసార్లు ఫెయిలైనా రాహుల్ గాంధీని మళ్లీ రీలాంచ్ చేయడానికి రాష్ట్రాన్ని ప్రయోగశాలగా మార్చడం సిగ్గుచేటని విమర్శించారు. తెలంగాణ ప్రజల పన్నులతో రాహుల్ గాంధీ రాజకీయ ఉనికిని బతికించడానికి కాంగ్రెస్ పడుతున్న ఆరాటం తప్ప ఇందులో మరొకటి లేదన్నారు. ఈమేరకు మంగళవారం రాంచందర్ రావు ఒక ప్రకటన విడుదల చేశారు. 'ఒకవక్క రాష్ట్రం అప్పుల్లో మునిగిపోయింది, పెండింగ్ బిల్లులు కట్టడానికి, ఇచ్చిన హామీలు అమలు చేయడానికి రూపాయి లేదంటారు.

తరువాయి 2వ పేజీలో...

ఉస్మానియాకు ఇస్తామన్న రూ.1000 కోట్లు ఎక్కడ?

వీసీ ఉద్యోగులను పట్టించుకోకుండా ప్రభుత్వానికి గులాం గిరి చేస్తున్నడు

ఉస్మానియా నాన్ టీచింగ్ ఉద్యోగుల సమస్యలపై గవర్నర్ స్పందించాలి

తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత

హైదరాబాద్, నవంబరు 10 (ప్రజాకలం) : ఉస్మానియా యూనివర్సిటీలో నాన్ టీచింగ్ స్టాఫ్ శ్రమను, రక్తాన్ని దోచుకుంటున్నారని తెలంగాణ



రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత ఆవేదన వ్యక్తం చేశారు. వారిని ఆదుకుంటామని,వర్సిటీకి వెయ్యి కోట్లు ఇస్తామని చెప్పిన ముఖ్యమంత్రి జాడలేకుండా పోయాడని ధ్వజమెత్తారు. తమ సమస్యలు పరిష్కరించాలంటూ ఉస్మానియా నాన్ టీచింగ్ స్టాఫ్

తరువాయి 2వ పేజీలో...

భైంసా మున్సిపాలిటీలో 'ఏసీబీ' కలకలం

- వరుసగా ఇద్దరు కమిషనర్లు వలకు!



నిర్మల్, నవంబర్ 9 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి): భైంసా మున్సిపాలిటీలో అవినీతి ఆరోపణలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి,మున్సిపల్ కార్యాలయంలో లంచాల వ్యవహారం మరోసారి వెలుగుచూడటంతో పట్టణంలో కలకలం రేగుతోంది. గతంలో కమిషనర్‌గా పనిచేసిన వెంకటేశ్వర్లు ఏసీబీ అధికారులకు దొరికిపోగా, తాజాగా ఇన్‌చార్జి కమిషనర్ జాదవ్ సంతోష్ సైతం లంచం తీసుకుంటూ దొరికిపోవడం గమనార్హం,2024 మే 22న అప్పటి మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు రూ. 30 వేల లంచం పరోక్ష పద్ధతిలో తీసుకుంటూ ఏసీబీకి చిక్కారు, ఆ ఘటనను మరువక ముందే, ప్రస్తుత ఇన్‌చార్జి కమిషనర్ జాదవ్ సంతోష్ కూడా నేరుగా లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు, ప్రజలకు పారదర్శకమైన సేవలు అందించాల్సిన బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్న అధికారులే వరుసగా అవినీతి ఆరోపణల్లో చిక్కుకోవడం మున్సిపల్ పాలనా తీరుపై తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. ఒకే మున్సిపాలిటీలో పనిచేసిన ఇద్దరు కమిషనర్లు వేర్వేరు సందర్భాల్లో ఏసీబీ వలకు చిక్కడంతో భైంసా మున్సిపాలిటీ ప్రతిష్ఠ మసకబారడమే కాకుండా, పట్టణ ప్రజల్లో తీవ్ర విస్మయం వ్యక్తమవుతోంది.

పుష్కరాల ఏర్పాట్లకు పక్కా ప్రణాళిక రూపొందించాలి



3

కలం కౌంటర్



బ్యాంకులు రైతులకు అండగా నిలవాలి

విద్యా, గృహ, ఎంఎస్ఎంఈ, మౌలిక సదుపాయాల రంగాలకు రుణాల పెంపునకు ప్రాధాన్యం ఇవ్వాలి

ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు బ్యాంకులు ప్రత్యేక చొరవ చూపాలి..

కరువును జయించేందుకు రైతులకు ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలు కల్పించాలి

రైతులకు రుణాల పునర్వ్యవస్థీకరణతో పాటు రబీకి కొత్త రుణాలు అందించాలి

ఎస్ఎల్‌బీసీ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



హైదరాబాద్, నవంబరు 10 (ప్రజాకలం) : ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో నెలకొన్న కరవు పరిస్థితులు, రైతులు ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని బ్యాంకులు రైతులకు అండగా నిలవాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కోరారు. అర్హులైన రైతుల పంట రుణాలను ఆర్బీఐ మార్గదర్శకాల ప్రకారం పునర్వ్యవస్థీకరించడం, రీషెడ్యూల్ చేయడంతో పాటు రబీ సీజన్‌కు అవసరమైన కొత్త

తరువాయి 2వ పేజీలో...



వెయ్యి గ్రామాల మైలురాయిని దాటిన

సమగ్ర భూ రీసర్వే

భూ యజమానుల ప్రయోజనాలే సర్వేలో అత్యంత ప్రాధాన్యత

రెవెన్యూ రికార్డుల ఆధారంగానే సర్వే ప్రక్రియ ప్రారంభించాలి

సర్వే అనంతరం భూ యజమానులకు నోటీసులు జారీ చేసి అభ్యంతరాల స్వీకరణకు అవకాశం కల్పించాలి

రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

హైదరాబాద్, నవంబరు 10 (ప్రజాకలం) తరతరాలుగా కొనసాగుతున్న భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు ప్రతి భూ యజమానికి తన భూమిపై స్పష్టమైన హక్కులు, కచ్చితమైన సరిహద్దులు కల్పించడమే లక్ష్యంగా గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర భూ రీసర్వేను అత్యంత పారదర్శకంగా, శాస్త్రీయంగా, పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ ప్రక్రియలో భూ యజమానుల ప్రయోజనాలు, వారి అభిప్రాయాలు, మనోభావాలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు.రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న భూ సర్వే పురోగతిపై మంగళవారం సచివాల యంలో రెవెన్యూ ఉన్నతాధికారులతో మంత్రి సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలు, రైతుల నుంచి వస్తున్న స్పందన, సాంకేతిక అంశాలు, సర్వేలో పాల్గొం టున్న సిబ్బందికి ఎదురవుతున్న పరిస్థితులపై సమగ్రంగా చర్చించారు. సర్వే ప్రక్రియలో పాల్గొంటున్న సిబ్బందితో స్వయంగా ఫోన్‌లో మాట్లాడి క్షేత్రస్థాయి పరిస్థితులను తెలుసుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 10,954 రెవెన్యూ గ్రామాలు ఉండగా, తొలి దశలో హైదరాబాద్ మినహా మిగిలిన 32 జిల్లాల్లో జిల్లాకు 70 గ్రామాల చొప్పున ఎంపిక చేసి, నక్షాలు అందుబాటులో లేని గ్రామాలను కూడా కలుపుకొని మొత్తం 2,720 గ్రామాల్లో రీసర్వే నిర్వహిస్తున్నట్లు మంత్రి తెలిపారు.ఇప్పటివరకు వెయ్యి గ్రామాల్లో రీసర్వే మైలురాయిని దాటగా, 416 గ్రామాల్లో సర్వే ప్రక్రియ పూర్తయిందని వెల్లడించారు. 125 సంవత్సరాల తర్వాత రాష్ట్రంలో సమగ్ర భూ సర్వేకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని, ఈ చారిత్రాత్మక కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో అధికారులు అంకితభావంతో పనిచేయాలని సూచించారు.

తరువాయి 2వ పేజీలో...

వచ్చే ముప్పై ఏళ్లు తెలంగాణ భవిష్యత్తు మీ చేతుల్లోనే..

మొదటి పేజీ తరువాయి...

రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్ఠను పెంచేలా, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టేలా నిబద్ధతతో విధులు నిర్వర్తించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రొబేషనరీ డీఎస్పీలకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. కేవలం పది మంది పోలీసు అధికారులు అరాచకంగా వ్యవహరించినా రాష్ట్రంలో పరిపాలన లేదని, శాంతిభద్రతలు క్షీణించాయని,
అవినీతి పెరిగిపోయిందనే ఆరోపణలు వెల్లువెత్తే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అదే పది మంది అధికారులు నిటారుగా నిలబడి, నిజాయితీగా, నిష్పక్షపాతంగా పనిచేస్తే తెలంగాణ ప్రతిష్ఠ పది రాష్ట్రాల్లో పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. మీ నుంచి నేను ఆశించేది అదే అంటూ యువ అధికారులకు బాధ్యతను గుర్తుచేశారు. కొత్తగా ఎంపికై శిక్షణ పూర్తి చేసుకున్న ప్రొబేషనరీ డీఎస్పీల వ్యాలిడిక్షన్ కార్యక్రమం ఎంసీఆర్ హెచ్ఆర్డీలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి ముఖ్య అతిథిగా హాజరై శిక్షణ సమయంలో ట్రైనీలు తీసుకున్న ఫొటోల ప్రదర్శనను తిలకించారు. నేర పరిశోధనలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగాన్ని వివరించే 'క్రైమ్ సీన్ ఫోరెన్సిక్స్' హ్యాండ్‌బుక్‌ను ఆవిష్కరించారు. వివిధ రంగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ట్రైనీ డీఎస్పీలకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలను అందజేశారు.

హోదా పెరిగినా మూలాలు మరిచిపోవద్దు:

డీఎస్పీలుగా బాధ్యతలు స్వీకరిస్తున్న సమయంలో తమ నేపథ్యాన్ని, తాము వచ్చిన సామాజిక పరిస్థితులను, ఎదుర్కొన్న కష్టాలను ఎట్టి పరిస్థితుల్లోనూ మరిచిపోవద్దని ముఖ్యమంత్రి సూచించారు. మనం ఎక్కడి నుంచి వచ్చామో మరిచిపోయిన రోజే మన హోదాకు న్యాయం చేయలేని పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు. ఏ స్థాయి నుంచి వచ్చినా, ఏ నేపథ్యం ఉన్నా ఒక ప్రత్యేకమైన లక్ష్యంతో పోలీసు శాఖలోకి అడుగుపెట్టారని, ఆ లక్ష్యాన్ని ప్రజాసేవకు ఉపయోగించాలని ఆకాంక్షించారు. బలమైన సంకల్పం, క్రమశిక్షణ, నిబద్ధత ఉంటే అసాధ్యమంటూ ఏదీ ఉండదని చెప్పారు. శిక్షణ పూర్తి కావడం మీ ప్రయాణానికి ముగింపు కాదు.. ఇది మొదటి అధ్యాయం మాత్రమేనని, అసలైన పరీక్ష ఇక నుంచి ప్రారంభమవుతుందని స్పష్టం చేశారు.

మీ పనితీరే ప్రభుత్వానికి గీటురాయి:

పోలీసు వ్యవస్థలో క్షేత్రస్థాయిలో నేరుగా ప్రజలతో మమేకమై పనిచేయాల్సిన కీలక బాధ్యత డీఎస్పీలపైనే ఉంటుందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ప్రభుత్వ విధానాలు, పాలనపై ప్రజల్లో ఏర్పడే అభిప్రాయానికి క్షేత్రస్థాయి పోలీసుల పనితీరే ప్రధాన కొలమానంగా మారుతుందని వివరించారు. పోలీసు అధికారి ప్రవర్తన, బాధితులతో వ్యవహరించే తీరు, ఫిర్యాదుల పరిష్కారంలో చూపే చొరవ ప్రభుత్వ ప్రతిష్ఠను ప్రభావితం చేస్తాయని అన్నారు. ప్రజలకు ఏ సమస్య వచ్చినా ముందుగా పోలీసులనే ఆశ్రయిస్తారంటే ఆ శాఖపై సమాజానికి ఉన్న విశ్వాసమే కారణమని గుర్తుచేశారు. ఏడు దశాబ్దాలుగా ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొంటూ, ప్రాణాలను సైతం పణంగా పెట్టి శాంతిభద్రతలను కాపాడిన సీనియర్ పోలీసు అధికారుల కృషి వల్లే నేడు పోలీసు శాఖకు సమాజంలో గౌరవం లభించిందని చెప్పారు. ఆ గౌరవాన్ని కాపాడటం కొత్త అధికారుల బాధ్యత అని స్పష్టం చేశారు.

బాధితుడి మాట వినడమే పరిష్కారానికి తొలి అడుగు:

పోలీసుల వద్దకు వచ్చే బాధితుల సమస్యలను కేవలం ఫిర్యాదులుగా చూడవద్దని, వాటి వెనుక ఉన్న బాధను, పరిస్థితులను అర్థం చేసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. సమస్య వచ్చిన వెంటనే పరిష్కారం కోసం తొందరపడటం కంటే ముందుగా సమస్య అసలు స్వరూపాన్ని తెలుసుకోవడం ముఖ్యమని, సమస్యను సరిగ్గా అర్థం చేసుకుంటే సగం పరిష్కారం లభించి నట్లేనని పేర్కొన్నారు. బాధితుల మాటలను ఓపికగా వినడం, వారి పరిస్థితిని అర్థం చేసుకోవడం, అందుబాటులో ఉన్న సమయం, వనరులు, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి న్యాయం చేయడం పోలీసుల ప్రాథమిక కర్తవ్యమని తెలిపారు. అధికారుల వద్దకు వచ్చిన సామాన్యుడికి న్యాయం జరుగుతుందనే నమ్మకం కలిగించడమే నిజమైన పోలీసింగ్ అని పరోక్షంగా స్పష్టం చేశారు.

నేరాల రూపం మారింది.. పోలీసింగ్ మారాలి:

సమాజంలో వస్తున్న మార్పులతో పాటు నేరాల స్వరూపం కూడా పూర్తిగా మారిపోయిందని ముఖ్యమంత్రి వివరించారు. గతంలో దొంగసారా, ఆహార ధాన్యాల కృత్రిమ కొరత వంటి సమస్యలు ప్రధానంగా ఉండేవని, కరువు కాటకాల సమయంలో నిత్యావసర వస్తువుల అక్రమ నిల్వలు, కృత్రిమ కొరత సృష్టించే వారిని నియంత్రించేందుకు ఎసెన్షియల్ కమోడిటీస్ యాక్ట్ వంటి చట్టాలు తీసుకొచ్చారని గుర్తుచేశారు. సరళీకృత ఆర్థిక విధానాలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి రావడంతో కొత్త అవకాశాలతో పాటు కొత్త సవాళ్లు కూడా పెరిగాయని చెప్పారు. ఒకప్పుడు సారా అక్రమ తయారీ ప్రధాన సమస్యగా ఉంటే, నేడు కొకైన్, హెరాయిన్, గంజాయి వంటి మాదకద్రవ్యాల అక్రమ రవాణా యువత భవిష్యత్తును దెబ్బతీసే ప్రమాదకర సమస్యగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. డ్రగ్స్ వ్యవహారాల్లో ఎంతటి పలుకుబడి ఉన్న వ్యక్తులు ఉన్నా ఉపేక్షించే ప్రసక్తే లేదని, ఈ లక్ష్యంతోనే ఈగల్ ఫోర్స్‌ను ఏర్పాటు చేశామని స్పష్టం చేశారు. ట్రాఫిక్ నియంత్రణ, ఆహార భద్రత, మాదకద్రవ్యాల నిర్మూలన, సైబర్ నేరాలు వంటి విభిన్న రంగాల్లో పోలీసులకు కొత్త సవాళ్లు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఎక్కడో కూర్చున్న వ్యక్తి కూడా మొబైల్ ఫోన్ ద్వారా ప్రజల సంపాదనను కొల్లగొడుతున్న పరిస్థితులు ఉన్నాయని వివరించారు. అందువల్ల పాత పద్ధతులతోనే నేరాలను అరికట్టాలనుకోవడం సాధ్యం కాదని, మారుతున్న నేరాల స్వరూపానికి అనుగుణంగా పోలీసుల విధానాలు, దర్యాప్తు పద్ధతులు, సాంకేతిక సామర్థ్యాలు మారాల్సిందేనని సూచించారు.

సొంత నైపుణ్యాలే పోలీసు శాఖకు పెట్టుబడి:

పోలీసు శాఖలో అవసరాలకు అనుగుణంగా సీఐడీ, ఏసీబీ, ఆక్టోపస్, గ్రేహౌండ్స్ వంటి ప్రత్యేక విభాగాలు ఏర్పాటయ్యాయని ముఖ్యమంత్రి గుర్తుచేశారు. కొత్తగా ఎంపికైన డీఎస్పీలు తమ ఆసక్తి, సామర్థ్యం, నైపుణ్యాలకు అనుగుణంగా ప్రత్యేక విభాగాలను ఎంచుకుని ప్రతిభను నిరూపించుకోవాలని సూచించారు. అవసరమైతే దేశంలోని మంచి సంస్థల్లో ప్రత్యేక శిక్షణ ఇప్పించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని భరోసా ఇచ్చారు. పోలీసు శాఖలో అవుట్‌సోర్సింగ్‌పై ఆధారపడటం వల్ల ఆశించిన ఫలితాలు రావని, శాఖలోనే అంతర్గత నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. గతంలో ఐఏఎస్, ఐపీఎస్ అధికారులకే విదేశీ శిక్షణ అవకాశాలు ఎక్కువగా ఉండేవని, తమ ప్రభుత్వం ఉపాధ్యాయులకు సైతం శిక్షణ అవకాశాలు కల్పించిందని వివరించారు. మారుతున్న నేరాలను ఎదుర్కొనేందుకు అవసరమైతే ఒకటి, రెండేళ్ల పాటు ప్రత్యేక శిక్షణకు పంపించడానికి కూడా ప్రభుత్వం సిద్ధంగా ఉందని ప్రకటించారు.

562 పోస్టులతో గ్రూప్-1 నియామకాలు:

యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే దృఢ సంకల్పంతో ఎన్నో సంక్లిష్ట పరిస్థితులను అధిగమించి గ్రూప్-1 నియామకాలను పూర్తి చేశామని ముఖ్యమంత్రి తెలిపారు. 2011లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో గ్రూప్-1 నియామకాలు చేపట్టిన తర్వాత, 2025లో తిరిగి ఈ నియామకాలు చేపట్టామని వివరించారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తర్వాత కూడా ఉన్నతస్థాయి ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగ యువతలో ఎన్నో ఆశలు, ఆకాంక్షలు ఉన్నాయని, గ్రాడ్యుయేషన్ పూర్తిచేసుకుని జీవితంలో ఉన్నతస్థాయికి ఎదగాలని కలలు కనే యువతకు నియామకాల జాప్యం తీవ్ర నిరాశ కలిగించిందని పేర్కొన్నారు. నోటిఫికేషన్లు జారీ అయిన తర్వాత ప్రశ్నాపత్రాల లీకేజీతో ఏర్పడిన గందరగోళ పరిస్థితులు, నిరుద్యోగ యువత ఎదుర్కొన్న ఆవేదన అందరికీ తెలిసిందేనని అన్నారు. ఉన్నతస్థాయి నియామకాలు చేపట్టే పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లో అనుభవం, అర్హత, బాధ్యత కలిగిన వ్యక్తులు ఉండాల్సిన అవసరం ఉందని, అలాంటి కీలక సంస్థల్లో రాజకీయ పునరావాసాలకు తావివ్వడం రాష్ట్ర భవిష్యత్తుతో చెలగాటమాడటమేనని వ్యాఖ్యానించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను ప్రక్షాళన చేసి, యూపీఎస్సీ చైర్‌పర్సన్‌తో పాటు నిపుణుల సలహాలు తీసుకుని ఉన్నతస్థాయి అనుభవజ్ఞులను నియమించామని తెలిపారు. నియామకాలు నిర్వహించే సంస్థకు చిత్తశుద్ధి, పారదర్శకత, బాధ్యత అత్యంత అవసరమని, అప్పుడే నిరుద్యోగుల్లో విశ్వాసం ఏర్పడుతుందని పేర్కొన్నారు. దేశంలోనే తొలిసారిగా ఒకేసారి 562 ఖాళీలతో గ్రూప్-1 నియామకాలు పూర్తి చేశామని, అందులో 119 మంది డీఎస్పీలుగా ఎంపికయ్యారని ముఖ్యమంత్రి వివరించారు. నియామకాల ప్రక్రియలో ప్రభుత్వం పూర్తి పారదర్శకత పాటించిందని పేర్కొంటూ, ప్రతిభ ఆధారంగా ఉన్నతస్థాయికి చేరుకున్న యువ అధికారులు ఇప్పుడు తమ బాధ్యతలను కూడా అదే పారదర్శకతతో నిర్వర్తించాలని పిలుపునిచ్చారు.

ప్రతిభకు ప్రోత్సాహం.. బాధ్యతకు గుర్తింపు:

ఈ కార్యక్రమంలో తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్, ఎంసీఆర్ హెచ్ఆర్డీ వైస్ చైర్మన్, డైరెక్టర్ జనరల్ శాంతికుమారి, హోంశాఖ కార్యదర్శి శిఖా గోయల్, రాష్ట్ర భద్రతా సలహాదారు బి. శివధర్ రెడ్డి, తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్ తదితరులు పాల్గొన్నారు. శిక్షణలో వివిధ విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన పలువురు ట్రైనీ డీఎస్పీలకు ముఖ్యమంత్రి జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. అధికారం చేతిలోకి వచ్చిందని అహంకారం ప్రదర్శిస్తే ప్రజల్లో ఆగ్రహం తప్పదు.. అదే అధికారం ద్వారా బాధితుడికి న్యాయం చేస్తే ప్రజల గుండెల్లో స్థానం దక్కుతుంది. పోలీసు యూనిఫాం వెనుక ఉన్నది వ్యక్తిగత ప్రతిష్ఠ కాదు.. ప్రజల భద్రత, ప్రభుత్వ విశ్వసనీయత, రాజ్యాంగ విలువలు. ఈ మూడు అంశాలను కాపాడినప్పుడే కొత్త తరం పోలీసు అధికారులు నిజమైన ప్రజా సేవకులుగా గుర్తింపు పొందుతారు.

కృష్ణా జలాల్లో తెలంగాణకు న్యాయమైన వాటా సాధించాలి

మొదటి పేజీ తరువాయి...

నీటిపారుదల శాఖ కార్యదర్శి ఈ. శ్రీధర్, జాయింట్ సెక్రటరీ కె. శ్రీనివాస్, అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి, సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సి.ఎస్. వైద్యనాథన్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

డిండి, అచ్చంపేట పనులు వేగవంతం

డిండి, అచ్చంపేట ఎత్తిపోతల పథకాల పనులను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ముందుగా నిర్ణయించిన ప్రణాళిక ప్రకారం ఏదుల నుంచి ఈ రెండు పథకాలకు నీటిని అందించేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ పథకాలకు అవసరమైన 0.6 టీఎంసీల నీటిని నార్లాపూర్ నుంచి ఏదుల వరకు తరలించేందుకు ఎలాంటి అడ్డంకులు లేకుండా చూడాలని సూచించారు. నీటి తరలింపునకు ఎక్కడ సొరంగాలు, ఎక్కడ కాలువలు నిర్మించాల్సి ఉంటుందో క్షేత్రస్థాయిలో పరిశీలించి సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) సిద్ధం చేయాలని ఆదేశించారు.

నివేదిక ఆధారంగా పనులు ప్రారంభించి ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించాలన్నారు.

కాళేశ్వరం పనుల్లో తొందరపాటు వద్దు

కాళేశ్వరం ప్రాజెక్టు అదనపు టీఎంసీ పనుల విషయంలో తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని ముఖ్యమంత్రి అధికారులకు స్పష్టం చేశారు. గత ప్రభుత్వం చేసిన తప్పులు పునరావృతం కాకుండా అన్ని అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి ముందుకెళ్లాలని సూచించారు. ప్రస్తుతం ఉన్న రెండు టీఎంసీల నీటిని పూర్తిస్థాయిలో తరలించలేని పరిస్థితులు ఉన్న నేపథ్యంలో అదనపు టీఎంసీ పనులపై బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు.

ముందుగా సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసుల పురోగతిని సమీక్షించాలని, అనంతరం భూసేకరణ ప్రక్రియను చేపట్టాలని ఆదేశించారు. కేంద్ర జల సంఘం నుంచి అవసరమైన అన్ని అనుమతులు పొందడంతో పాటు సమగ్ర ప్రాజెక్టు నివేదికను సిద్ధం చేసుకోవాలని అధికారులకు సూచించారు. అన్ని సాంకేతిక, న్యాయపరమైన అంశాలను పరిశీలించిన తర్వాతే తదుపరి నిర్ణయాలు తీసుకోవాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

ఈ నెలలోనే నామినేటెడ్ పోస్టుల భర్తీ

మొదటి పేజీ తరువాయి...

హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ జ్ఞాపకార్థం నిర్మించిన మెమోరియల్ పార్కుకు సంబంధించిన పుస్తకాన్ని రాహుల్‌కు అందజేశారు. రాహుల్ గాంధీతో దాదాపు అరగంట సేపు భేటీ అయిన మహేశ్ గౌడ్ వివిధ అంశాలపై చర్చించారు. ఈ భేటీ అనంతరం విలేకరులతో మాట్లాడిన టీపీసీసీ చీఫ్ ఆ వివరాలను వెల్లడించారు. భారత్ సమ్మిట్ కోసం రాష్ట్రానికి రానున్న రాహుల్ గాంధీ గిగ్ వర్కర్లతోనూ సమావేశమవుతారని తెలిపారు. పార్టీ, ప్రభుత్వంలో ఓబీసీల ప్రాతినిధ్యంపైనా చర్చించినట్లు చెప్పారు. ఈ నెలలోనే నామినేటెడ్ పోస్టుల భర్తీ ప్రక్రియ పూర్తి చేస్తామని పునరుద్ఘాటించారు. అయితే, పార్టీ నేతల మధ్య ఉన్న విభేదాలు, పంచాయితీలపై ఎలాంటి చర్చ జరగలేదని దాటవేశారు. ఆ వ్యవహారాలను పార్టీ సంస్థాగత ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ పర్యవేక్షిస్తారని స్పష్టం చేశారు. ఇక, నర్కు వ్యతిరేకంగా హైదరాబాద్‌లోనూ భారీ సభను ఏర్పాటు చేస్తామని, ఆ ర్యాలీకి రాహుల్ గాంధీని ఆహ్వానించామని చెప్పారు. త్వరలోనే ఈ సభ తేదీలు ఖరారు చేస్తామన్నారు. ఇక, కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ (సీపీపీ) అధ్యక్షురాలు సోనియా గాంధీ ఆత్మకథ పుస్తకంపై తెలంగాణలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

సోనియా ఆత్మకథ పుస్తకం కోసం మాట్లాడుతూ రాహుల్ భావోద్వేగానికి గురయ్యారని మహేశ్ గౌడ్ చెప్పారు.

అండాల సేకరణ అక్రమ దందాపై సర్కారు ఉక్కుపాదం!

మొదటి పేజీ తరువాయి...

ఆయా ఆసుపత్రుల యాజమాన్యాలకు ఇప్పటికే షోకాజ్ నోటీసులు జారీ చేశారు. మిగిలిన కేంద్రాల్లో తనిఖీలు కొనసాగుతున్నాయి. పోలీసుల స్వాధీనంలో ఉన్న రికార్డులు, జాతీయ ఏఆర్టీ అండ్ సరోగసీ రిజిస్ట్రీ నుంచి అందే వివరాలను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం తదుపరి చర్యలు చేపట్టనున్నారు. ఈ వ్యవహారానికి సంబంధించి పలువురు మహిళలను గుర్తించగా, వైద్యులు, ఐవీఎఫ్ కేంద్రాలు, మధ్యవర్తుల పాత్రపై విచారణ కొనసాగుతోంది. ఈ వ్యవహారంపై మరింత లోతుగా విచారణ జరిపేందుకు నవంబర్ 6న వైద్య అధికారులు న్యూఢిల్లీలోని నేషనల్ ఏఆర్టీ అండ్ సరోగసీ రిజిస్ట్రీని సందర్శించారు. తెలంగాణలో నమోదైన ఏఆర్టీ కేంద్రాలు, ఏఆర్టీ బ్యాంకులకు సంబంధించిన పూర్తి వివరాలను కోరారు.

రాష్ట్రానికి సంబంధించిన సమాచారాన్ని అందజేస్తామని నేషనల్ ఇన్ఫర్మాటిక్స్ సెంటర్ (ఎన్ఐసీ) అధికారులు హామీ ఇచ్చారు. అసిస్టెడ్ రిప్రొడక్టివ్ టెక్నాలజీ (రెగ్యులేషన్) చట్టం-2021, దాని నిబంధనలకు విరుద్ధంగా మహిళల నుంచి అండాలను సేకరించడం శిక్షార్హమైన నేరమని వైద్య ఆరోగ్య శాఖ హెచ్చరించింది. రాష్ట్రంలోని అన్ని ఏఆర్టీ క్లినిక్‌లు, ఏఆర్టీ బ్యాంకులు తప్పనిసరిగా చట్టబద్ధమైన రిజిస్ట్రేషన్ పొందడంతోపాటు నిర్దేశించిన నిబంధనలను కచ్చితంగా పాటించాలని స్పష్టం చేసింది. మధ్యవర్తుల మాయమాటలు, ఆర్థిక ప్రలోభాలకు లోనై అక్రమ వైద్య విధానాలకు మహిళలు బలికావద్దని వైద్య ఆరోగ్య శాఖ సూచించింది. ఇలాంటి అక్రమ కార్యకలాపాలు ఎక్కడైనా జరుగుతున్నట్లు గుర్తిస్తే సంబంధిత జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు ఫిర్యాదు చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేసింది.

వెయ్యి గ్రామాల మైలురాయిని దాటిన సమగ్ర భూ రీసర్వే

మొదటి పేజీ తరువాయి...

సర్వే ప్రక్రియను మరింత వేగవంతం చేయడంతో పాటు నాణ్యత, పారదర్శకత, కచ్చితత్వం విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని మంత్రి అధికారులకు సూచించారు.

రెవెన్యూ రికార్డుల ఆధారంగానే సర్వే ప్రారంభించాలి

గ్రామాల్లో భూ సర్వే ప్రారంభించడానికి ముందుగా ఆ గ్రామానికి సంబంధించిన రెవెన్యూ రికార్డులను పూర్తిస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించాలి, రికార్డుల్లో ఉన్న వివరాలు, భూముల విస్తీర్ణం, హక్కులు, సరిహద్దులను సమగ్రంగా పరిశీలించిన తర్వాతే వాటి ఆధారంగా క్షేత్రస్థాయిలో సర్వే ప్రక్రియను ప్రారంభించాలి.

సర్వే అనంతరం భూ యజమానులకు నోటీసులు జారీ చేయాలి

సర్వే పూర్తయిన అనంతరం సంబంధిత భూ యజమానులకు తప్పనిసరిగా నోటీసులు జారీ చేయాలి. సర్వేలో నమోదైన వివరాలను పరిశీలించుకునేందుకు, ఏవైనా అభ్యంతరాలు లేదా అభిప్రాయాలు ఉంటే తెలియజేసేందుకు వారికి తగిన అవకాశం కల్పించాలి, భూ యజమానుల అభ్యంతరాలను స్వీకరించి, వాటిని క్షుణ్ణంగా పరిశీలించి, నిబంధనల ప్రకారం పరిష్కరించాలి.

అభ్యంతరాల నమోదు, పరిష్కారంపై రైతులకు అవగాహన కల్పించాలి

సర్వే ప్రక్రియ ఎలా జరుగుతుంది? సర్వే అనంతరం భూ యజమానులకు ఎలాంటి నోటీసులు జారీ చేస్తారు? అభ్యంతరాలను ఎలా నమోదు చేయాలి? వాటిని ఏ విధంగా పరిష్కరిస్తారు? అనే అంశాలపై గ్రామస్థాయిలో రైతులకు, భూ యజమానులకు విస్తృతంగా అవగాహన కల్పించాలి. సర్వే ప్రక్రియపై ఎలాంటి అపోహలు, అనుమానాలు లేకుండా పారదర్శకంగా వ్యవహరించాలి.

భూ యజమానుల సంతృప్తే సర్వే విజయానికి ప్రామాణికం

సర్వే కేవలం ప్రభుత్వ రికార్డుల నవీకరణకే పరిమితం కాకూడదు. ప్రతి భూ యజమానికి తన భూమిపై స్పష్టమైన హక్కులు, కచ్చితమైన హద్దులు కల్పించే ప్రక్రియగా ఉండాలి. రైతుల అభిప్రాయాలు, సూచనలు, అభ్యంతరాలను గౌరవిస్తూ వారికి పూర్తి సంతృప్తి కలిగేలా సర్వే నిర్వహించాలి. భూ యజమానులకు పూర్తి న్యాయం జరిగేలా అధికారులు బాధ్యతతో వ్యవహరించాలి.

చిన్న పొరపాటు కూడా భవిష్యత్తులో వివాదానికి కారణం కాకూడదు

రీసర్వే ప్రారంభ దశలోనే ఉన్నందున క్షేత్రస్థాయిలో ఎక్కడైనా చిన్నచిన్న పొరపాట్లు, లోపాలు గుర్తించినట్లయితే వాటిని వెంటనే సరిదిద్దుకోవాలి. ఒక్క చిన్న తప్పిదం కూడా భవిష్యత్తులో మరో భూ వివాదానికి దారితీయకూడదు. సర్వేలో ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తూ కచ్చితత్వానికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలి.

భూదార్ కేటాయింపు ప్రక్రియను వేగవంతం చేయాలి

రీసర్వే పూర్తయిన గ్రామాల్లో ప్రతి భూమికి ఆధార్ నంబర్ తరహాలో ప్రత్యేక గుర్తింపునిచ్చే భూదార్ నంబర్ కేటాయింపు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలి. భూముల వివరాలు, హక్కులు, సరిహద్దులకు సంబంధించి స్పష్టమైన రికార్డులు అందుబాటులోకి తీసుకురావాలి. రాష్ట్రంలో ఇకపై కొత్తగా భూ సమస్యలు ఉత్పన్నం కాకుండా ఉండాలన్న ప్రజా ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా అధికారులు పనిచేయాలి.

తరతరాల భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలి

భూముల హక్కులు, సరిహద్దులు, విస్తీర్ణాలకు సంబంధించి అనేక సమస్యలు తరతరాలుగా కొనసాగుతున్నాయి. తమ జీవితకాలంలో కూడా ఈ సమస్యలకు పరిష్కారం లభించదనే నిరాశలో ఎంతోమంది భూ యజమానులు ఉన్నారు. ఒక తరం నుంచి మరో తరానికి బదిలీ అవుతున్న ఈ సమస్యలకు సమగ్ర భూ రీసర్వే ద్వారా శాశ్వత ముగింపు పలకాలి. భవిష్యత్తు తరాలకు భూ వివాదాలు లేని తెలంగాణను అందించడమే ఈ చారిత్రాత్మక కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని మంత్రి స్పష్టం చేశారు.

బుధవారం కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్

భూ రీసర్వే పురోగతి, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలు, సర్వే నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, భూ యజమానులకు కల్పించాల్సిన అవకాశాలపై బుధవారం జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఆర్డీవోలు, సర్వే శాఖ అసిస్టెంట్ డైరెక్టర్లతో ప్రత్యేక వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించాలని మంత్రి నిర్ణయించారు. ఈ సమావేశంలో జిల్లా వారీగా పురోగతిని సమీక్షించి, అధికారులకు తదుపరి కార్యాచరణపై స్పష్టమైన ఆదేశాలు ఇవ్వనున్నారు. ఈ సమీక్షలో రెవెన్యూ శాఖకార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్,సర్వే అండ్ ల్యాండ్ సెటిల్‌మెంట్ కమిషనర్ రాజీవ్ గాంధీ హనుమంతు,ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

గాంధీ కుటుంబం కోసం ఖజానా ఖాళీ చేస్తారా?

మొదటి పేజీ తరువాయి...

మరి రాహుల్ గాంధీ ఆర్భాటాల కోసం ఖజానా తలుపులు ఎలా తెరుచుకుంటున్నాయి? తెలంగాణ ప్రజల కష్టార్జితం గాంధీ కుటుంబానికి రాజకీయ పునరావాసం కల్పించడానికా?' అని రాంచందర్ రావు నిలదీశారు. ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయని కాంగ్రెస్ పార్టీ నేతగా రాహుల్ గాంధీకి తెలంగాణ గడ్డపై అడుగుపెట్టే నైతిక హక్కు లేదని స్పష్టం చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకపోవడంతో సుమారు 40 లక్షల మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని గుర్తు చేశారు. 'ఇచ్చిన జాబ్ క్యాలెండర్ ఊసే లేదు. ఉద్యోగ నోటిఫికేషన్ల జాడే లేదు. కొలువులు వస్తాయని ఆశపడ్డ నిరుద్యోగ యువతకు కాంగ్రెస్ దగా చేసింది' అని విమర్శించారు. రైతులకు రావాల్సిన 'రైతు బంధు' సాయం ఇంతవరకు ఖాతాల్లో పడలేదని పేర్కొన్నారు.' ప్రభుత్వ ఉద్యోగుల డీఏలు, రిటైర్డ్ ఉద్యోగుల పెన్షన్ల చెల్లింపులకు డబ్బులు లేవని సాకులు చెప్పే ప్రభుత్వం.. రాహుల్ గాంధీ కార్యక్రమాలకు మాత్రం వందల కోట్లు ఎక్కడి నుంచి తెస్తోంది. నాలుగు కోట్ల ప్రజల ప్రయోజనాలను పక్కనపెట్టి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. గాంధీ కుటుంబం కోసమే పనిచేస్తున్నారు. రాష్ట్ర ప్రజల సొమ్మును దుర్వినియోగం చేయడం తక్షణమే ఆపాలి. వెంటనే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు క్లియర్ చేయాలి. ఉద్యోగ హామీలు నెరవేర్చాలి. రైతు భరోసా నిధులు విడుదల చేయాలి. ఉద్యోగుల పెండింగ్ డీఏలు, రిటైర్మెంట్ బకాయిలను వెంటనే జమ చేయాలి..' అని రాంచందర్‌రావు డిమాండ్ చేశారు.

ఉస్మానియాకు ఇస్తామన్న రూ.1000 కోట్లు ఎక్కడ?

మొదటి పేజీ తరువాయి...

వర్సిటీ అడ్మినిస్ట్రేషన్ భవనం వద్ద చేపట్టిన ఆందోళనకు కవిత మంగళవారం మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ 35 ఏళ్లుగా ఉస్మానియాలో నాన్ టీచింగ్ స్టాఫ్ కు అన్యాయం జరుగుతోందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న పరిస్థితే తెలంగాణ వచ్చిన తర్వాత కూడా ఉండటం క్షమించరని నేరమన్నారు. రాష్ట్రంలో అన్ని యూనివర్సిటీల్లో ఉద్యోగులు, ప్రొఫెసర్లు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. రైతు ఏడ్చిన రాజ్యం బాగుపడదన్నట్లుగానే ఉద్యోగి ఏడ్చిన యూనివర్సిటీ బాగుండదన్నారు.

వీసీని చరిత్ర క్షమించదు...నాన్ టీచింగ్ ఉద్యోగులంతా సమస్యలతో ఇబ్బందులు పడుతుంటే వారికి అండగా ఉండాల్సిన వీసీ.. ప్రభుత్వానికి గులాంగిరి చేస్తున్నారని కవిత మండిపడ్డారు. టైమ్ స్కేల్, కాంట్రాక్ట్ ఉద్యోగులు ఉండగా వారిని కాదని కొత్త వాళ్లను నియమించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. ముందు ఉద్యోగులపై ప్రేమ చూపించాలని కోరారు. ఉద్యోగులు ఆందోళన చేస్తుంటే వారిని వీసీ ఇబ్బందులు పెడుతున్నాడని మండిపడ్డారు. ఉస్మానియాకు 105 ఏళ్లలో తొలిసారి మాదిగా బిడ్డను వీసీని చేశామని ముఖ్యమంత్రి గొప్పలు చెబుతున్నాడని..కానీ నిధులు ఇవ్వకపోతే ఆయన మాత్రం ఏం చేస్తాడని ప్రశ్నించారు. నిధులు ఇవ్వకుండా వీసీ ని బలి చేసే ప్రయత్నం చేస్తున్నారా? లేదంటే వీసీయే ప్రభుత్వం కోసం ఉద్యోగులను ఇబ్బంది పెడుతున్నాడా అని నిలదీశారు. అటానమస్ గా ఉండి ఉద్యోగులకు కోసం పోరాటం చేయాల్సిన వీసీ ప్రభుత్వానికి గులాం గిరి చేయటం మంచిది కాదని చెప్పారు. యూనివర్సిటీ కోసం ప్రభుత్వం తో కొట్లాడి బాగు చేసుకున్న వీసీలను చరిత్ర గుర్తుపెట్టుకుంటుందని.. కానీ ప్రభుత్వం కోసం వర్సిటీ ప్రయోజనాలను తాకట్టు పెడితే చరిత్ర క్షమించదని వీసీని హెచ్చరించారు.

ఏడాదిన్నరగా పట్టించుకోవటం లేదు

ఏడాదిన్నరగా నాన్ టీచింగ్ స్టాఫ్ ఆందోళనలు, ధర్నాలు చేస్తుంటే ఎందుకు స్పందించటం లేదని కవిత ప్రశ్నించారు. నాన్ పర్మినెంట్ ఉద్యోగులకు ఇచ్చే ప్రయోజనాలు లేకుండా చేస్తూ దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి విషయాల్లో ప్రదర్శించే తెలితేటలను ముఖ్యమంత్రి వద్ద ప్రదర్శించి ఉద్యోగులకు మేలు చేయాలని కోరారు. ఓయూలో 85 శాతం లోకల్ వాళ్లనే నియమించుకోవాల్సి ఉన్నప్పటికీ బీహార్, యూపీ వాళ్లను సెక్యూరిటీ కోసం నియమిస్తున్నారన్నారు. యూనివర్సిటీలో జరిగే అవినీతి బయట పడకుండా ఉండేందుకే బయట వాళ్లను నియమిస్తున్నారా అంటూ అనుమానం వ్యక్తం చేశారు. నాన్ టీచింగ్ స్టాఫ్ సమస్య లపై వర్సిటీ ఛాన్సలర్ గా ఉన్న గవర్నర్ ఎందుకు స్పందించటం లేదని ఆమె ప్రశ్నించారు.

ఓపీఎస్ అమలు చేయాలి

ఉస్మానియాలో ఉద్యోగులకు ఓపీఎస్ స్కీమ్ వర్తింపజేస్తామని ముఖ్యమంత్రి పచ్చి అబద్దాలు చెప్పారని కవిత అన్నారు.

2001 నుంచి 2004 వరకు ఉన్న వారికి ఈ స్కీమ్ వర్తింపజేయా లన్నారు. 2004 నుంచి ఉన్న వారికి కాంట్రీ బ్యూటరీ పెన్షన్ స్కీమ్ ను వర్తింపజేయాలన్నారు. ఏటా ఉద్యోగులకు ఇవ్వాల్సిన మొత్తాన్ని క్రమం తప్పకుండా చెల్లించాలని, చనిపోయిన టైమ్ స్కేల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. కాంట్రాక్ట్ ఉద్యోగుల వ్యవస్థ తీసేసి అందరినీ పర్మినెంట్ చేయాలన్నారు. ఈహెచ్ఎస్ స్కీమ్ ను రెగ్యులర్ ఎంప్లాయిస్ మాదిరిగా వర్తింజేయాలని డిమాండ్ చేశారు.

బ్యాంకులు రైతులకు అండగా నిలవాలి

మొదటి పేజీ తరువాయి...

రుణాలను సకాలంలో అందించాలని సూచించారు. రైతులకు రుణాల మంజూరులో జాప్యం చేయకుండా క్షేత్రస్థాయిలో బ్యాంకర్లు చొరవ చూపాలని స్పష్టం చేశారు.మంగళవారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమితి (ఎస్ఎల్బీసీ) సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. విద్యా రుణాల మంజూరులో బ్యాంకులు సానుకూలంగా ఉండి అర్హులైన విద్యార్థులకు గరిష్ఠ స్థాయిలో రుణాలు అందించాలనిహౌ కోరారు. విద్యా రుణాల మంజూరుపై ఎస్ఎల్బీసీ కన్వీనర్ ప్రత్యేకంగా పర్యవేక్షించాలని సూచించారు. వ్యక్తిగత గృహ నిర్మాణానికి రుణాలు అందించడంలోనూ బ్యాంకులు ప్రత్యేక చొరవ చూపాలన్నారు.హౌ గృహ నిర్మాణహౌ సంస్థలకు రుణాలివ్వడానికే పరిమితం కాకుండా సామాన్య ప్రజల సొంతింటి కల నెరవేర్చేందుకు వ్యక్తిగత గృహ రుణాలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈ), మౌలిక సదుపాయాల రంగాలకు నిర్దేశించిన రుణ లక్ష్యాలను సాధించేలా బ్యాంకులు చర్యలు తీసుకోవాలని కోరారు. పెద్ద పరిశ్రమలతో పోలిస్తే ఎంఎస్ఎంఈ రంగం ఎక్కువ మందికి ఉపాధి కల్పిస్తోందని, ఈ రంగానికి రుణాల పెంపు ద్వారా ఆర్థిక కార్యకలాపాలు విస్తరిస్తాయని తెలిపారు. మౌలిక సదుపాయాల అభివృద్ధి సేవల రంగం వృద్ధికి కీలకమని, ఈ రంగానికి తగిన స్థాయిలో రుణాలు అందించాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావం కేవలం తెలంగాణకే పరిమితం కాదని, దేశవ్యాప్తంగా, ప్రపంచవ్యాప్తంగా వ్యవసాయ రంగాన్ని ప్రభావితం చేస్తోందన్నారు. రాష్ట్రంలోని 31 జిల్లాల పరిధిలో 365 మండలాలను కరవు ప్రాంతాలుగా ప్రకటించామని, వీటిలో 111 మండలాలు తీవ్రంగా ప్రభావితమయ్యాయని తెలిపారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా రైతుల పెట్టుబడులు, ఆదాయాలు దెబ్బతిన్నాయని, ఈ పరిస్థితుల్లో రైతులకు బ్యాంకింగ్ వ్యవస్థ నుంచి తక్షణ సహకారం అవసరమని పేర్కొన్నారు. విఫలమైన రుతుపవనాల ప్రభావం రైతుకు, బ్యాంకుకు మధ్య ఉన్న సంబంధాన్ని దెబ్బతీయకూడదన్నారు. రైతులకు అందుబాటులో ఉన్న రుణ ఉపశమన చర్యలపై విస్తృతంగా అవగాహన కల్పించాలని, కలెక్టర్లు, వ్యవసాయ శాఖ అధికారులు, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్లు సమన్వయంతో పనిచేసి ఆర్బీఐ మార్గదర్శకాలను క్షేత్రస్థాయిలో అమలు చేయాలని సూచించారు. గత రుణాల రీషెడ్యూలింగ్‌తో పాటు అర్హులైన రైతులకు కొత్త పంట రుణాలను సకాలంలో అందించాలని కోరారు. చిన్న, సన్నకారు రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ అనుబంధ రంగాలపై ఆధారపడిన కుటుంబాలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు.

బెల్లంపల్లి వ్యాల్యూ పిచ్ ఈ టెక్నాలజీస్ సంస్థను సందర్శించిన తీగల్ పహాడ్ జడ్.పి.హెచ్.ఎస్ విద్యార్థులు



బెల్లంపల్లి, నవంబర్ 10, (ప్రజాకలం) ప్రతినిధి మంచిర్యాల జిల్లా,బెల్లంపల్లి పట్టణంలోని వ్యాలు పిచ్ ఈ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థను జడ్.పి.హెచ్.ఎస్. తీగల్ పహాడ్ విద్యార్థులు, ఉపాధ్యాయులు మంగళవారం సందర్శించారు.డైరెక్టర్ కిరణ్ మృదుల ఐటీ రంగం అంటే ఏమిటి,సంస్థలో జరిగే పనులు, ఐటీ ఉద్యోగాల్లోని రెండు ప్రధాన విభాగాలైన ప్రొడక్ట్ మరియు డెవలప్‌మెంట్ గురించి విద్యార్థులకు స్పష్టంగా వివరించారు.మేనేజర్ ఆదర్శ్ వర్ధన్ రాజు సంస్థ వర్క్‌ఫ్లో, వివిధ విభాగాల పనితీరు మరియు వ్యాల్యూ పిచ్ రూపొందించిన టెక్నాలజీ ప్రొడక్ట్స్ గురించి విద్యార్థులకు వివరించారు.అనంతరం విద్యార్థుల,ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఇండస్ట్రియల్ టూర్ ద్వారా వ్యాల్యూ పిచ్ ఈ టెక్నాలజీస్ సాఫ్ట్‌వేర్ కంపెనీ నీ సందర్శించడంతో ప్రత్యేక అనుభూతి కలిగించిందని, సాఫ్ట్‌వేర్ రంగంపై ఆసక్తి పెరిగిందన్నారు.బెల్లంపల్లి పట్టణంలో సాఫ్ట్‌వేర్ కంపెనీ నీ నిర్వహించడం,యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం చాలా గొప్ప విషయం అన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ జయచందర్, అడ్మిన్ సుధాకర్, టెక్నికల్ ఇంజనీర్ రామసాగర్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆశ వర్కర్ల న్యాయమైన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలి: సిఐటియు



బెల్లంపల్లి, నవంబర్ 10, (ప్రజాకలం) ప్రతినిధి.. ఆశ వర్కర్ల డిమాండ్లను పరిష్కరించాలని సిఐటియు ఆధ్వర్యంలో మంగళవారం బెల్లంపల్లి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం లో వినతి పత్రం అందజేశారు.డిసెంబర్ 15న నిరవధిక సమ్మెను నిర్వహిస్తున్నట్లు ఆశ వర్కర్లు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. తమ న్యాయమైన డిమాండ్లైన కనీస వేతనం,ఉద్యోగ భద్రత, ఈఎస్ఐ,పిఎఫ్ ఇన్సూరెన్స్ వంటి సదుపాయాలను వెంటనే కల్పించాలన్నారు.అనేకసార్లు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చామని,ప్రభుత్వం తమపై దృష్టి సారించి వెంటనే తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. లేని యెడల డిసెంబర్ 15 నుంచి నిర్వధిక సమ్మె చేయబోతున్నట్లు తెలిపారు.

108 అంబులెన్స్‌లో ప్రసవం తల్లి,బిడ్డ క్షేమం

ధర్మారం, నవంబర్ 10 : (ప్రజా కలం ప్రతినిధి) మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన ఇస్లావత్ అంజలి వయస్సు (26) నంవత్సరాల గర్భిణి స్త్రీ మంగళవారం రోజున అర్ధ రాత్రి 12:30 నిమిషాలకు పురిటి నొప్పులు రావడం తో 108 అంబులెన్స్ కు సమాచారం రాగా, 108 సిబ్బంది ఈ.యం.టి ఆరె. సతీష్, పైలెట్ సిరిపురం. కిషన్ లు వెంటనే స్పందించి వెళ్ళి కొత్తపల్లి నుండి పెద్దపల్లి మాత శిశు హాస్పిటల్ కి తీసుకువెళ్ళే మార్గ మధ్యలోనే పురిటి నొప్పుల అధికమవడంతో వెంటనే అంబులెన్స్ లోనే డెలివరీ నిర్వహించగా మగ బిడ్డ జన్మించాడు. తల్లి, బిడ్డ ఇద్దరికి ప్రథమ చికిత్స అందించి పెద్దపల్లి జిల్లా మాత శిశు హాస్పిటల్ లో చేర్పించడం జరిగింది. అంబులెన్స్ లోనే డెలివరీ చేసి ప్రథమ చికిత్స అందించి ఇద్దరి ప్రాణాలు కాపాడిన సిబ్బందికి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



హాజరు పేరిట విద్యార్థినుల వేధింపులు తగవు


- బాలికల కళాశాల ప్రిన్సిపాల్‌పై వేటు వేయాలి
- ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్ల సందీప్,జిల్లాల ప్రశాంత్



పెద్దపల్లి,నవంబర్10:(ప్రజాకలం జిల్లాప్రతినిధి) స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో విద్యార్థినుల భవిష్యత్తుతో చెలగాటమాడుతున్న ప్రిన్సిపాల్‌ను తక్షణమే సస్పెండ్ చేయాలని ఎస్ఎఫ్ఐ పెద్దపల్లి జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. మంగళవారం కళాశాలను సందర్శించి విద్యార్థినుల సమస్యలను తెలుసుకున్న అనంతరం ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్ల సందీప్,జిల్లాల ప్రశాంత్ మాట్లాడారు. కళాశాలలో 70 శాతం హాజరు లేదనే సాకుతో విద్యార్థినుల నుంచి పరీక్ష రుసుము తీసుకోకుండా ప్రిన్సిపాల్ ఉద్దేశపూర్వకంగా తిరస్కరించారని మండిపడ్డారు.సోమవారం సాయంత్రం 6 గంటల వరకు బాలికలను కళాశాలలోనే ఉంచి తీవ్ర మానసిక ఆందోళనకు గురిచేశారని ఆరోపించారు. సకాలంలో రుసుము తీసుకోకుండా ఇప్పుడు అదనపు జరిమానాతో చెల్లించాలనడం పేద విద్యార్థినులపై పెనుభారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. జరిమానా కడితే తగ్గని హాజరు పెరుగుతుందా అని నిలదీశారు.ప్రిన్సిపాల్ నిర్లక్ష్యం వల్ల ఏర్పడిన జరిమానా భారాన్ని ఆమె సొంతంగా భరించి పరీక్ష ఫీజును వెంటనే స్వీకరించాలని స్పష్టం చేశారు.బాధ్యురాలైన ప్రిన్సిపాల్‌పై ఉన్నతాధికారులు కఠిన చర్యలు తీసుకోకపోతే పెద్దపల్లి డిఐఈవో కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి మామిడిపల్లి అరవింద్,సుల్తానాబాద్ మండల అధ్యక్షుడు తాండ్ర గౌతమ్ సాహు, నాయకులు అభిలాష్,నరేష్ తదితరులు పాల్గొన్నారు.

పుష్కరాల ఏర్పాట్లకు పక్కా ప్రణాళిక రూపొందించాలి

క్షేత్రస్థాయిలో పరిశీలించి అవసరమైన శాశ్వత, తాత్కాలిక మౌలిక సదుపాయాలను గుర్తించాలి
అన్ని శాఖలు మూడు రోజుల్లోగా నిర్ణీత నమూనాలో పనుల అంచనా ప్రతిపాదనలు సమర్పించాలి
పార్కింగ్, షటిల్ బస్సులు, స్నాన ఘాట్లు, భద్రత, ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలి
గోదావరి పుష్కరాల వివిధ శాఖల పనుల పై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్



జగిత్యాల ప్రతినిధి నవంబర్ 10 (ప్రజా కలం): గోదావరి పుష్కరాలు -2027 ను దృష్టిలో ఉంచుకొని ధర్మపురి, ఇతర ప్రాంతాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పటిష్టమైన ఏర్పాట్ల కోసం పక్కా ప్రణాళిక రూపొందించాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో ఎస్పీ అశోక్ కుమార్‌తో కలిసి సంబంధిత శాఖల అధికారులతో గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై కలెక్టర్ బి. సత్య ప్రసాద్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పుష్కరాల కోసం ఈ.వై. కన్సల్టెన్సీ, ఏజెన్సీ హైదరాబాద్ వారు రూపొందించిన ప్రాథమిక ప్రణాళికను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అధికారులు,ఈ.వై. కన్సల్టెన్సీ, ఏజెన్సీ ప్రతినిధులు వివరించారు. కలెక్టర్ బి. సత్య ప్రసాద్ మాట్లాడుతూ పుష్కరాలకు ఇంకా ఆరు నెలల సమయం మాత్రమే ఉన్నందున ప్రతి శాఖ తన పరిధిలో చేపట్టాల్సిన పనుల పై ముందస్తు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఏజెన్సీ రూపొందించిన ప్రాథమిక ప్రణాళికను క్షేత్రస్థాయిలో పరిశీలించి, వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా అవసరమైన మార్పులు, చేర్పులు చేయాలని ఆదేశించారు. క్షేత్రస్థాయి సిబ్బంది ప్రతి ప్రాంతాన్ని స్వయంగా పరిశీలించి, పుష్కరాల సమయంలో ఎదురయ్యే సమస్యలను ముందుగానే గుర్తించాలని, ఈ.వై. కన్సల్టెన్సీ ఏజెన్సీ ప్రతిపాదించిన అంశాలతో పాటు అదనంగా అవసర మైన సదుపాయాలు, పనులను కూడా ప్రతిపాదించాలని తెలిపారు.గోదావరి పుష్కరాలు జరిగే ప్రాంతాలలో క్షేత్రస్థా యిలో సమగ్రంగా పరిశీలించి, ఎలాంటి లోటుపాట్లు లేకుండా పూర్తిస్థాయి ప్రణాళిక, ఖచ్చితమైన అంచనాలు సిద్ధం చేయాలని నూచించారు. వివిధ శాఖలకు సంబంధించిన పనుల ఎస్టిమేషన్లను మూడు రోజుల్లోగా నిర్ణీత నమూనా ఫారంలో సమర్పించాలని ఆదేశించారు. పుష్కరాల ఏర్పాట్లకు అవసరమైన నిధుల కోసం ప్రభుత్వానికి పంపే ప్రతిపాదనలు, అంచనాలు కచ్చితంగా ఉండాలని, ఏదైనా అవసరమైన పనికి నిధుల ప్రతిపాదనలో లోపం జరిగితే పుష్కరాల నిర్వహణ మొత్తం ఇబ్బందులకు గురయ్యే అవకాశం ఉందని కలెక్టర్ స్పష్టం చేశారు. ధర్మపురి గోదావరి తీరంలో స్నాన ఘాట్లు, తాత్కాలిక మరుగుదొడ్లు, స్నానపు గదులు, దుస్తులు మార్చుకునే గదులు, మంచినీటి ట్యాపులు, పారిశుద్ధ్య సదుపాయాలు ఏర్పాటు చేసేందుకు అనువైన ప్రాంతాలను క్షేత్రస్థాయిలో గుర్తించాలని సూచించారు. భక్తుల రాకపోకలకు అనుగుణంగా తాత్కాలిక పార్కింగ్ ప్రాంతాలను గుర్తించి, అక్కడి నుంచి స్నాన ఘాట్లు, ఆలయానికి చేరుకునేందుకు షటిల్ బస్సుల నిర్వహ ణపై స్పష్టమైన ప్రణాళిక రూపొందిం చాలన్నారు. వాహనాల రాకపోకలు, పార్కింగ్, బన్సుల రాకపోకలు, భక్తుల నడక మార్గాలు పరస్పరం ఇబ్బంది కలగకుండా ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు.

1,331.84 హెక్టార్లలో 9 జోన్లు, 20 సెక్టార్లుగా (వివిధ శాఖల) ప్రణాళిక

ఈ.వై. కన్సల్టెన్సీ ఏజెన్సీ రూపొందించిన లేఅవుట్ ప్రణాళిక ప్రకారం ధర్మపురిలో మొత్తం 1,331.84 హెక్టార్ల పరిధిలో పుష్కరాల ఏర్పాట్లను ప్రతిపాదించారు. ఇందులో 9 కార్యాచరణ జోన్లు, 20 సెక్టార్లుగా విభజించి వివిధ శాఖలకు బాధ్యతలు కేటాయించేలా ప్రణాళిక రూపొందించారు. వసతి, బస్సులు, బస్‌స్టాండ్, అత్యవసర సేవలు, ఘాట్లు, మాస్టర్ కంట్రోల్ రూమ్, భక్తుల నడక మార్గాలు, ఆలయం, వీఐపీ, వీవీఐపీ ఏర్పాట్ల కోసం ప్రత్యేక జోన్లను ప్రతిపాదించారు. తాత్కాలిక ఏర్పాట్లలో భాగంగా సుమారు 161 హెక్టార్లలో పార్కింగ్, 33 హెక్టార్లలో టెంట్ సిటీ, 10 హెక్టార్లలో హోల్డింగ్ ప్రాంతాలు, 4 హెక్టార్లలో సాంస్కృతిక కార్యక్రమాల ప్రాంగణాలు, 2.5 హెక్టార్లలో విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేయాలని ప్రాథమికంగా ప్రతిపాదించారు. ధర్మపురిలో సుమారు 800 మీటర్ల మేర గోదావరి ఘాట్ల అభివృద్ధి, దుస్తులు మార్చుకునే గదులు, మరుగుదొడ్లు, కేశఖండన కేంద్రాలు, ఘాట్ల సుందరీకరణ, బ్రహ్మ పుష్కర కుండ అభివృద్ధి, జీవవైవిధ్య పార్కు, చెరువుల పునరుజ్జీవనం, ప్రధాన కూడళ్ల అభివృద్ధి, రహదారుల విస్తరణ, మార్కెట్ వీధుల అభివృద్ధి, బస్టాండ్ ఆధునీకరణ, ఆలయ పరిసరాల్లో భక్తులకు అనుకూలమైన వసతుల కల్పన వంటి ప్రతిపాదనలను ఏజెన్సీ వివరించింది. ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ పుష్కరాల సందర్భంగా భారీగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని ఎస్పీ నూచించారు. వాహనాల రాకపోకలు, ట్రాఫిక్ మళ్లింపు, పార్కింగ్ ప్రాంతాల నిర్వహణకు ముందస్తు ప్రణాళిక రూపొందించాలని తెలిపారు.భక్తుల రద్దీని నిరంతరం పర్యవేక్షించేందుకు అవసరమైన ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం, కీలక కూడళ్లు, ఘాట్లు, ఆలయ పరిసరాల్లో పోలీసు సిబ్బందిని నియమించడం, అత్యవసర పరిస్థితుల్లో తక్షణ స్పందనకు తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. సంబంధిత శాఖలన్నీ సమన్వయంతో పనిచేస్తూ పుష్కరాల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని ఎస్పీ ఆదేశించారు.ఈ సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎన్. ప్రసూనాంబ, ఈ.వై. కన్సల్టెన్సీ ఏజెన్సీ, ప్రతినిధులు, వివిధ శాఖల జిల్లా అధికారులు, సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ధర్మారం మండల కేంద్రంలో అందెశ్రీ వర్ధంతి వేడుకలు



ధర్మారం, నవంబర్ 10 : (ప్రజా కలం ప్రతినిధి) మండల కేంద్రం లో మంగళవారం రోజున అందెశ్రీ వర్ధంతి వేడుకలు నిర్వహించారు అందని ప్రజల జీవితాన్ని అక్షరాల్లో ఆవిష్కరించడం ప్రకృతి సౌందర్యాన్ని కవిత్వం లో పలికించడం మానవ సంబంధాలోని అర్థాలు పాటల్లో ప్రతిబింబించడం పల్లె జీవనంలోని అను భూతులను ప్రపంచానికి పరిచయం చేయడం అందిస్తూ ప్రత్యేకత అని ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘం మండల శాఖ అధ్యక్షులు బొల్లి నందయ్య పేర్కొన్నారు. అందెశ్రీ చిత్ర పటానికి పూల మాలవేసి ఘన నివాళులు అర్పించారు. ఆయన కలం నుంచి జాలువారిన ప్రతి పాటలోను తెలంగాణ మట్టి పరిమళం ప్రజల జీవన సంఘర్షణ ప్రకృతిపై ప్రేమ కనిపిస్తాయని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమానికి అక్షరాయుధమైన అందెశ్రీ అసలు పేరు అందే ఎల్లయ్య ప్రస్తుత సిద్దిపేట జిల్లా రేపర్తి లో నిరుపేద కుటుంబం లో జన్మించి పాఠశాల విద్యకు దూరమై పశువుల కాపరిగా జీవనం సాగించాడని పేర్కొన్నారు. ఆయన జీవితంలో అసా ధారణ పరిణామం ఆశువు గా పాటలు పాడుతూ ప్రజల హృదయాల్లో స్థానం సంపాదించారని పేర్కొ న్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం లో అందె శ్రీ పాత్ర ప్రత్యేకమైనదని అన్నారు.
కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం లో వచ్చిన తర్వాత 2004 లో అందెశ్రీ గీతాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గుర్తిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించడం ఆయన ప్రతిభను గుర్తించడం హర్షి నియమన్నారు. ఈ కార్య క్రమం లో ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చొప్పదండి మల్లేశం, అంబేద్కర్ అవార్డు గ్రహీత సుంచు మల్లేశం, నాయ కులు ఇరుగురాల రాజనర్సు, లక్ష్మణ్, లింగన్న, తదితరులు పాల్గొన్నారు.

ఈ నెల 13న మెగా జాబ్ మేళా

పీఎన్‌బీ మెట్‌లైఫ్‌లో భారీగా ఉద్యోగావకాశాలు - జిల్లా ఉపాధి అధికారి ఎం. రాజశేఖర్



పెద్దపల్లి,నవంబర్ 10:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి కల్పించే లక్ష్యంతో ప్రఖ్యాత పీఎన్‌బీ మెట్‌లైఫ్ సంస్థలో ఖాళీల భర్తీకి ఈ నెల 13న శుక్రవారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎం.రాజశేఖర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం,తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ ఉద్యోగ మేళా ద్వారా మొత్తం 700 ఖాళీలను భర్తీ చేయనున్నారని,ఇందులో లైఫ్ ఇన్సూరెన్స్ మేనేజర్లు 150, చీఫ్ ఇన్సూరెన్స్ మేనేజర్లు 100, డిస్ట్రిబ్యూషన్ మేనేజర్లు 150, లైఫ్ పోర్ట్‌ఫోలియో మేనేజర్లు 300 పోస్టులు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు.ఇంటర్మీడియట్, ఏదైనా డిగ్రీ లేదా పీజీ విద్యార్హతలు కలిగి, 25 నుంచి 60 ఏళ్ల మధ్య వయస్సున్న స్త్రీ,పురుష అభ్యర్థులు ఈ ఉద్యోగాలకు అర్హులని వెల్లడించారు.ఎంపికైన వారికి విద్యార్హత, ప్రతిభ ఆధారంగా ఏడాదికి రూ.1.5 లక్షల నుంచి రూ.3.6 లక్షల వరకు వార్షిక వేతనంతో పాటు అదనపు ప్రోత్సాహకాలు ఉంటాయని,వీరు పెద్దపల్లి,రామగుండం, గోదావరిఖని,మంథని, మంచిర్యాల,కరీంనగర్ ప్రాంతాల్లో విధులు నిర్వర్తించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. అర్హత, ఆసక్తి ఉన్న అభ్యర్థులు నవంబర్ 13న ఉదయం 10 గంటలకు పెద్దపల్లి బాలుర ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలోని టాస్క్ ప్రాంతీయ కేంద్రానికి తమ రెజ్యూమ్, విద్యార్హతల ధ్రువపత్రాల నకళ్లు, ఆధార్ కార్డు,అనుభవముంటే సంబంధిత పత్రాలతో హాజరై పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.ఇతర పూర్తి వివరాలకు 8985336947,8121262441, 9182117078 నంబర్లలో సంప్రదించవచ్చని ఉపాధి కల్పనాధికారి తెలిపారు.

రోడ్డు పనులను వేగవంతం చేయాలి : జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష



పెద్దపల్లి,నవంబర్ 10:(ప్రజాకలం జిల్లాప్రతినిధి) గోదావరి పుష్కరాల నేపథ్యంలో పెద్దపల్లి జిల్లా మంథని పట్టణంలో చేపట్టిన రోడ్డు విస్తరణ,నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు.మంగళవారం ఆయన మంథని- గోదావరిఖని రహదారి,పుష్కర ఘాట్ పరిసరాలు,మహాలక్ష్మి ఆలయ రోడ్డు విస్తరణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శాఖల మధ్య సమన్వయంతో పనులను నిర్దేశిత గడువులోగా,నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలన్నారు.విస్తరణకు అడ్డంగా ఉన్న విద్యుత్ స్తంభాలను వెంటనే తొలగించాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. ఈ పరిశీలనలో మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్, వైస్ చైర్మన్ సయేందర్ రెడ్డి,విద్యుత్ శాఖ ఎస్ఈ గంగాధర్,కమిషనర్ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలి

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష



పెద్దపల్లి,నవంబర్ 10:(ప్రజాకలం జిల్లాప్రతినిధి) జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు అధికారులు పటిష్ట చర్యలు చేపట్టాలని పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు.మంగళవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ అరుణశ్రీతో కలిసి రోడ్డు భద్రతా ప్రమాణాలపై సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పెద్దపల్లి పట్టణంలోని జంక్షన్లలో ఆక్రమణలను తొలగించి,రోడ్డు విస్తరణ పనులు వేగవంతం చేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు.రోడ్లపై పశువులను వదిలే వారిపై కఠిన చర్యలు తీసుకుంటూ రూ.10 వేల జరిమానా విధించి,వాటిని గోశాలలకు తరలించాలన్నారు.రామగుండంలో అవసరమైన చోట్ల సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని,పాఠశాలల వద్ద స్కూల్ జోన్ బోర్డులు,రహదారులపై రేడియం స్టిక్కర్లు,రోడ్డు స్ట్రిప్స్ తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని సూచించారు.రహదారుల పక్కన పిచ్చి మొక్కలను తొలగించాలని, హిట్ అండ్ రన్ కేసుల బాధితులకు త్వరగా పరిహారం అందేలా ప్రతిపాదనలు పంపాలని తెలిపారు. హెల్మెట్,సీట్‌బెల్ట్ ధరించడం,మద్యం తాగి వాహనాలు నడపకపోవడం,అతివేగం నియంత్రణపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని పేర్కొన్నారు.అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి రోడ్డు భద్రతా నిబంధనలను కట్టుదిట్టంగా అమలు చేయాలని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో డీసీపీ రామ్‌రెడ్డి,ఆర్ అండ్ బీ ఈఈ భావ్‌సింగ్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ

- ఉపాధ్యాయుడు మునిందర్



పెద్దపల్లి,నవంబర్ 10:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

విద్యార్థుల సంక్షేమమే ధ్యేయంగా,సమాజ సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పెద్దపల్లి మండలం భోజన్నపేట ప్రాథమికోన్నత ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు మునిందర్ పిలుపునిచ్చారు.పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు స్వంత ఖర్చులతో అల్పాహారం చేసేందుకు అవసరమైన ప్లేట్లను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు మునిందర్ మాట్లాడుతూ సమాజ సేవా కార్యక్రమాల్లో భాగంగా విద్యార్థులకు తమ వంతు సహాయం అందించడం ఎంతో సంతృప్తినిస్తుందని పేర్కొన్నారు.పాఠశాలలో ఒకటో తరగతి నుండి ఏడో తరగతి వరకు చదువుతున్న 65 మంది విద్యార్థులకు అనుకూలంగా ఉండేందుకు ఈ ప్లేట్లను అందజేసినట్లు ఆయన తెలిపారు.ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే నిరుపేద విద్యార్థులకు అవసరమైన కనీస వసతులు,సౌకర్యాలు కల్పించడంలో ఉపాధ్యాయులు,దాతలు ముందుకు రావాల్సిన ఆవశ్యకత ఉందని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు.మునిందర్ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి విద్యార్థులకు సహాయం చేయడం పట్ల తోటి ఉపాధ్యాయులు,గ్రామ పెద్దలు,విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.సమాజ హితం కోసం ఆయన చేస్తున్న సేవా కార్యక్రమాలు పలువురికి ఆదర్శప్రాయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయ బృందం,పాఠశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా కలం
బుధవారం, నవంబర్ 11, 2026

వోట్ జీరో.. ఫండ్స్ హీరో

దేశంలో ఉన్న 2,074 రిజిస్టర్డ్ అన్‌రికగ్నైజ్డ్ పొలిటికల్ పార్టీల ఆర్థిక లెక్కలపై ఆ రిపోర్ట్. చదివాక ఒకటే ఫీలింగ్ వస్తుంది. ఇది పార్టీల జాబితా కాదు, ఘోస్ట్‌ల జాబితా.రిజిస్టర్డ్ అన్‌రికగ్నైజ్డ్ పొలిటికల్ పార్టీ అంటే ఎన్నికల సంఘం దగ్గర పేరు నమోదు చేసుకున్న పార్టీ. కానీ రాష్ట్ర పార్టీ హోదా గానీ, జాతీయ పార్టీ హోదా గానీ రాలేదు. ఓట్ల శాతం సరిపోక, సీట్లు రాక, లేదా రిజిస్టర్ అయ్యాక అసలు ఎన్నికల్లోనే దిగక. వీటికి సొంత గుర్తు ఉండదు. ఫ్రీ సింబల్స్ లిస్ట్‌లోంచి ఎంచుకోవాలి. ఉచిత ఓటర్ల జాబితా కాపీలు ఉండవు. దూరదర్శన్‌లో ఫ్రీ టైమ్ ఉండదు. పార్టీ ఆఫీస్‌కి సబ్సిడీ భూమి ఉండదు. ఇన్ని లేకపోయినా ఒక పవర్‌ఫుల్ బెనిఫిట్ మాత్రం ఉంది. ఆదాయపు పన్ను మినహాయింపు. కండిషన్స్ చాలా చిన్నవి. ఇన్‌కమ్ టాక్స్ రిటర్న్ వేయాలి, రూ20,000 దాటిన విరాళాల వివరాలు ఏటా ఎన్నికల సంఘానికి ఇవ్వాలి. అంతే. ఇంకా ట్విస్ట్ ఏంటంటే, రూ20,000 దాటిన విరాళమే రాలేదని చెప్పినా మినహాయింపు పోదు. ఒకసారి రిజిస్టర్ అయ్యావంటే ఆ కవచం నీ దగ్గరే ఉంటుందిభారత ఎన్నికల సంఘానికి రాజకీయ పార్టీలు సమర్పించిన తాజా విరాళాల నివేదికల ప్రకారం జాతీయ రాజకీయాల్లో ఆసక్తికరమైన గణాంకాలు వెలుగులోకి వచ్చాయి. రూ. 20,000 అంతకంటే ఎక్కువ మొత్తం ఉన్న విరాళాల సేకరణలో కాంగ్రెస్ పార్టీ పూర్తిగా వెనుకబడిపోయింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో పొందిన రూ. 517.39 కోట్ల విరాళాలను పొందిన కాంగ్రెస్ 2025-26 నాటికి ఈ విరాళాల మొత్తం ఏకంగా 75 శాతం పడిపోయి రూ. 130.69 కోట్లకు పరిమితమైంది.దశాబ్ద కాలంలో కాంగ్రెస్ పార్టీ పొందిన విరాళాల్లో ఇది అతి తక్కువ.కాంగ్రెస్‌కు విరాళాలు ఇంత దారుణంగా పడిపోవడానికి ప్రధాన కారణం ప్రుడెంట్ ఎలక్టోరల్ ట్రస్ట్ నుంచి వచ్చిన నిధులు గణనీయంగా తగ్గడమే. గతంలో ఈ ట్రస్ట్ నుంచి కాంగ్రెస్‌కు రూ. 216.34 కోట్ల వరకు విరాళాలు రాగా, ఈసారి అవి దాదాపు 88 శాతం పడిపోయి కేవలం రూ. 25 కోట్లకు చేరుకున్నాయి. 2025-26 నివేదికలోకాంగ్రెస్ పార్టీకి లభించిన ప్రధాన విరాళాల్లో స్టార్ సిమెంట్స్ రూ. 5 కోట్లు , సజ్జన్ భజంకా రూ. 4 కోట్లు , ప్రేమ్ కుమార్ భజంకా రూ. 2 కోట్లు ప్రముఖంగా ఉన్నాయి.అంతకు మించిఎవరూ విరాళాలివ్వడం లేదు.అధికార భారతీయ జనతా పార్టీ తో పోలిస్తే కాంగ్రెస్ ఆదాయం చానా దూరంలో ఉంది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బీజేపీ ఎన్నికల సంఘానికి సమర్పించిన నివేదిక ప్రకారం.. రూ. 20,000 కంటే ఎక్కువ ఉన్న విరాళాల రూపంలో ఆ పార్టీ ఏకంగా రూ. 6,074.02 కోట్లను రాబట్టింది. ఇది కాంగ్రెస్ పార్టీ సేకరించిన విరాళాల మొత్తానికి దాదాపు 12 రెట్లు . బిజెపికి చెందిన 2025-26 విరాళాల నివేదిక ఇంకా ఇసిఐ వెబ్‌సైట్‌లో విడుదల కావాల్సి ఉంది.అయితే, ఈ రూ. 20 వేల పైబడిన విరాళాల వివరాలు మాత్రమే కాంగ్రెస్ పార్టీ మొత్తం ఆదాయాన్ని ప్రతిబింబించవు. చిన్న మొత్తాల విరాళాలు , సభ్యత్వ రుసుములు, కూపన్ల విక్రయం, బ్యాంక్ డిపాజిట్లపై వచ్చే వడ్డీల ద్వారా కాంగ్రెస్ అదనపు ఆదాయాన్ని పొందుతుంది. గత ఆర్థిక సంవత్సరంలో కూపన్ నిధుల సేకరణ ద్వారానే కాంగ్రెస్‌కు రూ. 350 కోట్లకు పైగా సమకూరాయి. ఈసిఐ ద్వారా పూర్తి ఆడిట్ ఖాతాల నివేదిక వెలువడిన తర్వాతే రెండు ప్రధాన జాతీయ పార్టీల సమగ్ర ఆర్థిక స్థితిగతులపై పూర్తి స్పష్టత రానుంది. తెలంగాణలో 104 ఉన్నాయి. వాటిలో 78 పార్టీల ఆడిట్ రిపోర్ట్, విరాళాల రిపోర్ట్, రెండూ సీఈవో వెబ్‌సైట్‌లో లేవు. ప్రతి నాలుగు పార్టీల్లో మూడు. ఆంధ్రప్రదేశ్‌లో 65 పార్టీలు ఉంటే 45 పార్టీలకు ఒక్క పేపర్ కూడా లేదు. రెండు రాష్ట్రాలనూ కలిపితే 169 పార్టీల్లో 123 ఘోస్ట్‌లు. అంటే 72.8%. రెండు రిపోర్టులూ పక్కాగా పెట్టిన పార్టీలు తెలంగాణలో 17, ఏపీలో 14. దేశ సగటు 22.2% ఉంటే తెలంగాణ 16.3% దగ్గర ఆగిపోయింది. ఏపీ 21.5%. దేశం మొత్తం చూస్తే 2,074లో 1,330 పార్టీల లెక్కలు పబ్లిక్‌కి కనిపించవు, దాదాపు 64%. యూపీలో 530 పార్టీల్లో 304 పార్టీలది ఇదే కథ. ఉత్తరాఖండ్‌లో 26 పార్టీల్లో ఒక్కదానిది కూడా లేదు, జీరో. పుదుచ్చేరి, సిక్కిం, త్రిపుర, చండీగఢ్ కూడా అంతే.తెలంగాణలో లెక్కలు చెప్పిన 26 పార్టీల మొత్తం ఆదాయం కలిపి రూ18.98 లక్షలు. ఏపీలో 20 పార్టీల ఆదాయం రూ 70.8 లక్షలు. అదే ఏడాది గుజరాత్‌లోని 29 పార్టీలు రూ510 కోట్లు చూపించాయి. రూ1 కోటి దాటి ఆదాయం చూపిన 49 పార్టీల టాప్ లిస్ట్‌లో తెలంగాణ, ఏపీ పార్టీలు ఒక్కటి కూడా లేవు. కాబట్టి మన దగ్గర సమస్య భారీ మొత్తాలు కాదు. లెక్కలే లేకపోవడం. రిపోర్ట్ మన పార్టీలను ఏ తప్పూ చేశాయని అనలేదు, వెరిఫై చేయడానికి సమాచారమే లేదని మాత్రమే చెప్పింది. ఇక్కడ లెక్కలు ఇంకా విచిత్రంగా ఉన్నాయి. ఒక పార్టీ నాకు మొత్తం రూ100 విరాళంగా వచ్చింది అని చెప్పి, అందులో రూ200 పెద్ద విరాళాలు అని చూపిస్తే మ్యాథ్స్ కూడా ఏడుస్తుంది. రిపోర్ట్‌లో ఇలాంటి 14 పార్టీలు ఉన్నాయి. అందులో రెండు తెలంగాణవి.మజ్లిస్ బచావో తహ్రీక్ ఆదాయం 0, మొత్తం విరాళాలు 0. కానీ కాంట్రిబ్యూషన్ రిపోర్ట్‌లో రూ1.29 లక్షల పెద్ద విరాళాలు ఉన్నాయి. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో 7 సీట్లలో పోటీ చేసి 49,423 ఓట్లు తెచ్చుకుంది. విశ్వ భారత్ పార్టీ ఆదాయం రూ900, మొత్తం విరాళాలు రూ200, పెద్ద విరాళాలు రూ 30,000. ఒక సీటులో పోటీ చేస్తే వచ్చిన ఓట్లు 55. యాభై ఐదు. ఇది టైపో కాదు.తెలంగాణ మొత్తం చూసినా అదే సీన్. రూ20,000 పైబడిన విరాళాలు రూ 84.8 లక్షలు, మొత్తం విరాళాలు రూ12.67 లక్షలు. ఏపీలో రూ 1.07 కోట్లు వర్సెస్ రూ 70.1 లక్షలు. పైగా ఖర్చు రూ 78.2 లక్షలు, ఆదాయం రూ70.8 లక్షలే. అంటే ఆడిట్ ఫైల్ ఒక కథ చెప్తోంది, కాంట్రిబ్యూషన్ రిపోర్ట్ మరో కథ చెప్తోంది. ఈ రెండు ఫైళ్లు ఒకదానితో ఒకటి మాట్లాడుకోలేదు.సరే, తెలుగు రాష్ట్రాలు చిన్న లెవల్. అసలు సినిమా గుజరాత్, ఢిల్లీ, రాజస్థాన్‌లో ఉంది..జన్ సురాజ్ పార్టీ ఈజ 2024-25లో రూ101 కోట్ల ఆదాయం చూపింది. ఖర్చు రూ9.2 కోట్లు మాత్రమే. బిహార్ 2025లో 238 సీట్లలో పోటీ చేసి 16,77,583 ఓట్లు తెచ్చుకుంది. కానీ గెలిచిన సీట్లు జీరో. తర్వాత 2026లో బాంకీపూర్ ఉపఎన్నికలో 64,151 ఓట్లతో ఒక సీటు గెలిచింది. ఆ పార్టీ విరాళాల్లో వేదాస్ వెంచర్స్ ఒక్కటే రూ85 కోట్లు 85 లావాదేవీల్లో ఇచ్చింది. ప్రశాంత్ కిషోర్ రూ10 కోట్లు 10 విరాళాల్లో ఇచ్చారని రిపోర్ట్ చెప్పింది. డబ్బు ఉంది, పోటీ ఉంది, ఓట్లు ఉన్నాయి, గ్రౌండ్ ఉంది. అక్కడ లెక్కలు పెట్టారు, ఫైల్ చేశారు, పబ్లిక్‌కి కనిపిస్తున్నాయి.ఇక తమిళగ వెట్రి కళగం సెప్టెంబర్ 2024లో రిజిస్టర్. ఈజ 2024-25లో డిక్లేర్ చేసిన ఆదాయం రూ7.57 లక్షలు. ఆ తర్వాత తమిళనాడు 2026 ఎన్నికల్లో 233 సీట్లలో పోటీ చేసి 1.72 కోట్ల ఓట్లు తెచ్చుకుంది. తమిళనాడులో 108, పుదుచ్చేరిలో 2, మొత్తం 110 సీట్లు. అంటే రూ7.57 లక్షలతో 110 సీట్లు. పక్కన న్యూ ఇండియా యునైటెడ్ పార్టీ రూ291 కోట్లతో 1,426 ఓట్లు. ఇప్పుడు చెప్పు, పొలిటికల్ పవర్ డబ్బుతో వస్తుందా, జనంతో వస్తుందా? పీఎంకే 4 సీట్లు, జన్‌సత్తా దళ్ లోక్‌తాంత్రిక్ 2 సీట్లు, ఆజాద్ సమాజ్ పార్టీ (కాన్షీ రామ్) 1 లోక్‌సభ సీటు గెలిచాయి. చిన్న పార్టీలు ఓట్లతో సీట్లుగా మారగలవని ఇవే ప్రూఫ్.ఎన్నికల సంఘం బ్లైండ్ కాదు. 2025 ఆగస్టు 9న 334, సెప్టెంబర్ 18న 474, మొత్తం 808 పార్టీలు ఆరేళ్లు పోటీ చేయలేదని డీలిస్ట్ చేసింది. ఇంకో 359 పార్టీలపై ఆడిట్ ఖాతాలు ఇవ్వలేదని చర్యలు మొదలుపెట్టింది. 2022లో 537 పార్టీలను తొలగించింది. 2026 మార్చిలో రూల్ కూడా మార్చింది.

ఇది ఎల్‌నినో కాదు కేసీఆర్ తెచ్చిన కరువే

పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ - కాళేశ్వరం వైఫల్యాలే ప్రస్తుత దుస్థితికి కారణం



పెద్దపల్లి,నవంబర్10:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

రాష్ట్రంలో నెలకొన్న ప్రస్తుత పరిస్థితులకు ప్రకృతి వైపరీత్యమో లేదా ఎల్‌నినో ప్రభావమో కారణం కాదని,గత బీఆర్ఎస్ పాలకుల అనాలోచిత నిర్ణయాలు, కాళేశ్వరం ప్రాజెక్టు వైఫల్యాలే అసలు కారణమని పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ స్పష్టం చేశారు. మంగళవారం స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.ప్రజల దృష్టిని మళ్లించేందుకే బీఆర్ఎస్ నేతలు ఎల్‌నినో సాకును తెరపైకి తెస్తున్నారని ఎంపీ మండిపడ్డారు.రాష్ట్రంలో కనిపిస్తున్నది ఎల్‌నినో ప్రభావం కాదు,కేసీఆర్ స్వయంగా తెచ్చిపెట్టిన కరువు అని ఎద్దేవా చేశారు.లక్షల కోట్ల ప్రజాధనాన్ని కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో వృథా చేశారని,నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడం వల్లే మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోయిందని విమర్శించారు.చేసిన తప్పులను కప్పిపుచ్చుకునేందుకు ఇప్పుడు విపక్ష నేతలు అసత్య ప్రచారాలకు దిగుతున్నారని ఆరోపించారు.ప్రాజెక్టులో వెంటనే పంపులు ఆన్ చేయాలంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేస్తున్న వ్యాఖ్యలపై ఎంపీ తీవ్రంగా స్పందించారు.కేటీఆర్‌కు బహిరంగ సవాల్ విసురుతూ మేడిగడ్డ ప్రాజెక్టు పటిష్టతపై మీకు అంత నమ్మకమే ఉంటే,స్వయంగా మీరే అక్కడికి రండి.కుంగిపోయిన బ్యారేజీ పిల్లర్ల కింద నిలబడి పంపులను ఆన్ చేయించండి.మాటల్లో చూపిస్తున్న ధీమాను చేతల్లో నిరూపించండి అని నిలదీశారు. రాజకీయ లబ్ధి కోసం వేలాది మంది ప్రజల ప్రాణాలను పణంగా పెట్టలేమని ఎంపీ స్పష్టం చేశారు.నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ నిపుణులు,సాంకేతిక బృందాలు పూర్తిస్థాయిలో అధ్యయనం చేసి,ప్రాజెక్టు సురక్షితమని ధ్రువీకరించే వరకు మోటార్లు నడపడం ప్రమాదకరమన్నారు.నిపుణుల నివేదికల ఆధారంగా అవసరమైన మరమ్మతులు చేపట్టిన తర్వాతే తదుపరి నిర్ణయం ఉంటుందని తేల్చిచెప్పారు.ఇప్పటికైనా గత పాలకులు తమ వైఫల్యాలను ఒప్పుకోవాలే తప్ప,ప్రజలను తప్పుదోవ పట్టించే చౌకబారు రాజకీయాలు మానుకోవాలని హితవు పలికారు.

ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే బియ్యం విక్రయించాలి

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి,నవంబర్10:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

జిల్లాలో బియ్యం కృత్రిమ కొరత సృష్టించకుండా,ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే విక్రయించేలా వ్యాపారులు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.బియ్యం అక్రమ నిల్వలకు పాల్పడినా,అధిక ధరలకు విక్రయించినా సంబంధిత వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.అక్టోబర్ 30న జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆధ్వర్యంలో పెద్దపల్లి పట్టణ పరిధిలోని వలు హోల్‌సేల్,రిటైల్ బియ్యం దుకాణాల్లో క్షేత్రస్థాయి అధికారులు విస్తృత ఆకస్మిక తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు.ఈ తనిఖీల్లో డిప్యూటీ తహశీల్దార్లు,



ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు దుకాణాలు, గోదాముల్లోని బియ్యం నిల్వలను క్షుణ్ణంగా పరిశీలించడంతో పాటు ధరల పట్టికలు, తూకాలు,స్టాక్ రిజిస్టర్లను తనిఖీ చేసినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరల ప్రకారం బిపిటి, కెఎన్ఎమ్ రకం బియ్యం మిల్లు వద్ద కిలో రూ.62, హోల్‌సేల్ ధర రూ.64, రిటైల్ ధర రూ.66గా, తెలంగాణ సోనా రకం బియ్యం మిల్లు వద్ద కిలో రూ.70,హోల్‌సేల్ ధర రూ.72, రిటైల్ ధర రూ.74గా,హెచ్ఎమ్‌టి, జై శ్రీరామ్ రకం బియ్యం మిల్లు వద్ద కిలో రూ.75, హోల్‌సేల్ ధర రూ.77, రిటైల్ ధర రూ.79గా నిర్ణయించినట్లు కలెక్టర్ తెలిపారు.వ్యాపారులు ఈ ధరలకు మించి విక్రయించరాదని స్పష్టం చేశారు.ప్రతి దుకాణం,మిల్లు ఎదుట వినియోగదారులకు స్పష్టంగా కనిపించేలా రోజువారీ బియ్యం నిల్వ వివరాలు, ప్రభుత్వం నిర్ణయించిన విక్రయ ధరలతో కూడిన బోర్డును తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని సూచించారు.ట్రేడ్ లైసెన్స్,జీఎస్టీ లైసెన్స్, ఎఫ్ఎస్ఎస్ఏఐ అనుమతిపత్రాలను తనిఖీ అధికారులకు చూపించేందుకు సిద్ధంగా ఉంచాలని,రోజువారీ కొనుగోళ్లు,అమ్మకాల వివరాలను స్టాక్ రిజిస్టర్లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని తెలిపారు.26 కిలోల బియ్యం బస్తా పేరుతో 24 లేదా 25 కిలోల బియ్యం విక్రయించినట్లయితే మోసపూరిత కొలతల చట్టం ప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.నవంబర్ 4-2026 నాటికి జిల్లా వ్యాప్తంగా మొత్తం 50 బియ్యం దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి, నిబంధనల ఉల్లంఘనలకు సంబంధించి 9 కేసులు నమోదు చేసినట్లు కలెక్టర్ తెలిపారు.జిల్లా వ్యాప్తంగా ఆకస్మిక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, అక్రమ నిల్వలు,ధరల ట్యాంపరింగ్, తూకాల్లో తేడాలు,రికార్డుల నిర్వహణలో లోపాలు గుర్తిస్తే నిత్యావసర సరుకుల చట్టం ప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఆ ప్రకటనలో స్పష్టం చేశారు.

విద్యార్థుల విద్యాభివృద్ధికి సంపూర్ణ సహకారం

పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ - సుల్తాన్‌పూర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు బ్యాగుల పంపిణీ



పెద్దపల్లి,నవంబర్ 10:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) విద్యార్థుల విద్యాభివృద్ధికి తనవంతు సంపూర్ణ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ స్పష్టం చేశారు.ఎలిగేడు మండలంలోని సుల్తాన్‌పూర్ ప్రభుత్వ పాఠశాలను ఆయన సందర్శించి,విశాఖ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు స్కూల్ బ్యాగులను పంపిణీ చేశారు.అనంతరం విద్యార్థులతో ఆత్మీయంగా మాట్లాడి,వారి చదువులతో పాటు పాఠశాలలో ఉన్న సౌకర్యాలు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు.పాఠశాలలో తాగునీటి సమస్య,ఉపాధ్యాయుల కొరత ఉందని ఉపాధ్యాయులు,విద్యార్థులు ఎంపీ దృష్టికి తీసుకురాగా,వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని భరోసా ఇచ్చారు.ఈ సందర్భంగా జిల్లా స్థాయి తెలుగు వ్యాసరచన పోటీల్లో ప్రథమ స్థానం సాధించిన పాఠశాల విద్యార్థిని సాయి విజ్ఞతను అభినందిస్తూ,ఆమెకు సైకిల్ బహుమతిగా అందజేస్తానని ప్రకటించారు.ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ స్వర్గీయ కాకా హయాంలోనే ఈ పాఠశాలకు ప్రహరీ గోడ నిర్మించారని గుర్తు చేసుకున్నారు.పాఠశాలకు సీసీ రోడ్డు నిర్మాణానికి ఎంపీ ల్యాడ్స్ నిధులు కేటాయిస్తానని,అలాగే వాటర్ ప్లాంట్ ఏర్పాటు,అదనపు తరగతి గదుల నిర్మాణానికి ప్రత్యేక కృషి చేస్తానని తెలిపారు.గతంలో 11మంది విద్యార్థులు మాత్రమే ఉన్న ఈ పాఠశాలలో ప్రస్తుతం 90 మంది చదువుతున్నారంటే ఉపాధ్యాయుల చిత్తశుద్ధి,అంకితభావమే కారణమని కొనియాడారు.విద్యార్థులను ఎలక్ట్రిక్ ఆటోలో బడికి తీసుకురావడం, తిరిగి ఇళ్లకు చేర్చడం వంటి చర్యలు ఉపాధ్యాయుల బాధ్యతాయుత సేవలకు నిదర్శనమని ప్రశంసించారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి పెద్దపల్లి జిల్లాను విద్యా రంగంలో అగ్రగామిగా నిలపాలని పిలుపునిచ్చారు.రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం విద్య,వైద్య రంగాలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణంతో పాటు మధ్యాహ్న భోజనం ద్వారా పౌష్టికాహారాన్ని అందిస్తోందని వివరించారు.విద్యార్థుల్లో సృజనాత్మకత,వినూత్న ఆలోచనలను ప్రోత్సహించేందుకు కాకా గ్రోత్ ఫండ్‌ను అందుబాటులోకి తెచ్చామని,విద్యార్థులు స్టార్టప్ ఐడియాలతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

టీఆర్ఎస్ జెండా గద్దెల నిర్మాణానికి వినతి

మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేసిన పార్టీ నాయకులు

మెట్‌పల్లి టౌన్ ప్రతినిధి నవంబర్10(ప్రజా కలం) పట్టణంలోని పలు ప్రధాన ప్రాంతాల్లో తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పార్టీ జెండా గద్దెల నిర్మాణానికి అనుమతి ఇవ్వాలని కోరుతూ మంగళవారం పార్టీ నాయకులు మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ రఘు ఆదేశాల మేరకు పార్టీ ప్రతినిధి బృందం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్‌ను కలిసి దరఖాస్తు సమర్పించింది. పట్టణంలో పార్టీ కార్యకలాపాలను విస్తరించడంతో పాటు, ఆయా వార్డుల్లో ప్రజా సమస్యలపై పోరాటాలను కొనసాగించేందుకు జెండా గద్దెల ఏర్పాటు అవసరమని నాయకులు తెలిపారు. వినతిపత్రంపై కమిషనర్ సానుకూలంగా స్పందిస్తూ, నిబంధనల ప్రకారం పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.



ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ మెట్‌పల్లి పట్టణ అధ్యక్షుడు లింగంపల్లి సంజీవ్, ప్రధాన కార్యదర్శి కొలిచెలిమెల లత, మహిళా విభాగం అధ్యక్షురాలు ప్రీతి, యువజన నాయకుడు కోరుట్ల రాజు, విద్యార్థి సంఘాల నాయకులు సోమిడి ప్రశాంత్, సోమిడి రాజు తదితరులు పాల్గొన్నారు.

పేద రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలి

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష



పెద్దపల్లి,నవంబర్ 10:(ప్రజాకలం జిల్లాప్రతినిధి) ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే పేద రోగులకు మెరుగైన వైద్య సేవలతో పాటు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు సకాలంలో అందేలా చూడాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. మంగళవారం ఆయన పెద్దపల్లి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఓపీ వార్డు, క్యాజువాలిటీ, లేబర్ రూమ్,ఆపరేషన్ థియేటర్, ఐసీయూ విభాగాలను పరిశీలించి,రోగులకు అందుతున్న చికిత్స, మందుల లభ్యతపై ఆరా తీశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వైద్యులు, సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు.ఆసుపత్రిలో పారిశుద్ధ్యం,రోగులకు అందించే ఆహార నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం వహించవద్దని స్పష్టం చేశారు.వైద్యులు,సిబ్బంది అంకితభావంతో విధులు నిర్వహిస్తూ ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల్లో నమ్మకాన్ని మరింత పెంచాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్,వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఈనెల17న జిల్లా స్థాయి యువజనోత్సవాలు

- జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి ఎ.సురేష్

పెద్దపల్లి,నవంబర్ 10:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని నవంబర్ 17న ఉదయం 9 గంటలకు పెద్దపల్లి అమర్ నగర్‌లోని సిరి ఫంక్షన్ హాల్‌లో జిల్లా స్థాయి యువజనోత్సవాలు నిర్వహించనున్నట్లు జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి ఎ.సురేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.15 నుంచి 29 ఏళ్ల లోపు యువతీ యువకులకు జానపద నృత్యం (గ్రూప్), జానపద గీతాలు (గ్రూప్), పెయింటింగ్, నుక్కడ్ నాటక్ (వీధినాటకం), కవిత్వ రచన విభాగాల్లో పోటీలు ఉంటాయి. ఒక్కరు ఒక అంశంలోనే పాల్గొనాలి. గత మూడేళ్లలో జాతీయ స్థాయి



పోటీల్లో పాల్గొన్న వారికి అర్హత లేదు. ఇక్కడ గెలిచిన వారు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధిస్తారు.ఆసక్తి గలవారు 'మై భారత్' (వీఎం దీప్షుతీఫ్) పోర్టల్‌లో నవంబర్ 16 లోపు రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవాలి. పోటీల రోజున రిజిస్ట్రేషన్ ప్రింట్, ఆధార్ కార్డు జిరాక్స్, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు సమర్పించాలి. పూర్తి వివరాలకు 9963960063 నంబర్‌లో సంప్రదించవచ్చు.

శిలాఫలకంపై దుండగుల దాష్టీకం

- దుండగులపై చర్యలకు గ్రామస్తుల డిమాండ్

- బాధ్యులను వదిలేది లేదు: ఏఈ నాగరాజు

పెద్దపల్లి,నవంబర్ 10:(ప్రజాకలం జిల్లాప్రతినిధి) పెద్దపల్లి జిల్లా కాల్వ శ్రీరాంపూర్ మండలం మొట్లపల్లి గ్రామంలో ఎస్సీ సబ్-ప్లాన్ నిధులతో మంజూరైన సి.సి.రోడ్డు



ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేయడం తీవ్ర కలకలం రేపింది. గ్రామంలో స్థానిక శాసనసభ్యులు చింతకుంట విజయరమణారావు చేతుల మీదుగా ప్రారంభమైన ఈ రోడ్డు అభివృద్ధి పనుల అధికారిక శిలాఫలకాన్ని కొందరు దుండగులు ఉద్దేశపూర్వకంగానే నేలమట్టం చేశారు.ప్రజాధనంతో చేపట్టిన అభివృద్ధి పనుల వివరాలు,ప్రజాప్రతినిధులు, అధికారుల పేర్లతో కూడిన శిలాఫలకాన్ని ఇలా ధ్వంసం చేయడంపై స్థానికంగా తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేస్తూ సమాజంలో అలజడి సృష్టించేందుకు యత్నిస్తున్న ఇలాంటి వ్యక్తులపై సంబంధిత అధికారులు,పోలీసులు సమగ్ర విచారణ చేపట్టి,బాధ్యులను తక్షణమే గుర్తించి కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

బాధ్యులపై చర్యలు తీసుకుంటాం: పంచాయతీరాజ్ ఏఈ నాగరాజు

ఈ ఘటనపై పంచాయతీరాజ్ ఏఈ నాగరాజును వివరణ కోరగా.. శిలాఫలకం ధ్వంసం చేసిన విషయంపై ఉన్నతాధికారులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తామని తెలిపారు.ప్రభుత్వ ఆస్తిని ఉద్దేశపూర్వకంగా ధ్వంసం చేసిన బాధ్యులను గుర్తించి,వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

ఎల్‌నినో ముప్పు.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి..

- ముందస్తు చర్యల్లో ప్రభుత్వం విఫలమైంది

- కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్

మల్లాపూర్, నవంబర్ 10 (ప్రజా కలం ప్రతినిధి): రానున్న రోజుల్లో ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉండే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ సూచించారు. మల్లాపూర్ ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతూ, రానున్న యాసంగి సాగుకు అనుకూల పరిస్థితులు కనిపించడం లేదని, ప్రభుత్వం ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంలో విఫలమైందని విమర్శించారు. కష్టకాలంలో రాజకీయాలకు అతీతంగా అన్ని గ్రామాల సర్పంచ్ లు ప్రజలను ఆదుకోవాలని అన్నారు.అయితే మండలంలో సమస్యలు ఉన్న పలు శాఖల సమస్యలు చర్చకు రాకపోవడం అందులో ముఖ్యంగా అటవీ శాఖ, ఆర్టీసీ, ఐసీడీఎస్ శాఖలకు సంబంధించి పలు సమస్యలు నెలకొన్నప్పటికీ సమావేశంలో వాటిపై చర్చించకపోవడం సమావేశాన్ని త్వరితగతిన ముగించడం ప్రశ్నార్థకంగా మారింది. ప్రజా సమస్యల పరిష్కారానికి వేదిక కావాల్సిన సమావేశంలో కీలక అంశాలు చర్చకు రాకపోవడం చర్చనీయాంశంగా మారింది. ఈ సమావేశంలోడీఆర్డీఓ నరేష్, ఎంపీడీవో అలువలశ్రీకాంత్,తహసీల్దార్ రామచందర్, ఎంఈఓ దామోదర్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



అంబర్‌పేట్‌లో ఘనంగా బీఆర్ఎస్ నేత

మల్లికార్జున్ యాదవ్ జన్మదిన వేడుకలు

- ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్



హైదరాబాద్ నవంబర్ 10 (ప్రజాకలం న్యూస్) అంబర్‌పేట్ నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, తెలంగాణ ఉద్యమకారుడు మల్లికార్జున్ యాదవ్ జన్మదిన వేడుకలు పటేల్ నగర్‌లోని ఎస్వీఆర్ ఫంక్షన్ హాల్‌లో అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ వేడుకలకు అంబర్‌పేట్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

మల్లికార్జున్ యాదవ్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఈ వేడుకల్లో భాగంగా స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో రక్తదానం చేసిన వారికి ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ స్వయంగా పండ్లు, జ్యూస్‌లు పంపిణీ చేసి, శాలువా కప్పి అభినందించారు. సమాజ సేవకు నిదర్శనంగా నిలిచిన ఈ రక్తదాన శిబిరాన్ని ఇంత విజయవంతంగా నిర్వహించినందుకు మల్లికార్జున్ యాదవ్‌ను ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు.

అనంతరం వేదికపై మల్లికార్జున్ యాదవ్‌తో ఎమ్మెల్యే కేక్ కట్ చేయించి, ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మల్లికార్జున్ యాదవ్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు. వేడుకల అనంతరం కార్యక్రమానికి విచ్చేసిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులకు విందు భోజనం ఏర్పాటు చేశారు. ఈ జన్మదిన వేడుకల్లో నియోజకవర్గానికి చెందిన పలువురు బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

అంతర్ జిల్లాల ద్విచక్ర వాహనాల దొంగ అరెస్ట్

- 10 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్న పోలీసులు

- విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించిన పెద్దపల్లి ఏసిపి గజ్జి కృష్ణ

ధర్మారం, నవంబర్ 10 : (ప్రజా కలం ప్రతినిధి) అంతర్ జిల్లాల దొంగను అరెస్టు చేశారు. మంగళవారం రోజున విలేకరుల సమావేశం లో వివరాలను వెల్లడించిన పెద్దపల్లి జిల్లా ఏసీపీ గజ్జి కృష్ణ మాట్లాడుతూ మంగళవారం రోజున ఉదయం 08 : 00 గంటల సమయం లో జక్కన్న పల్లి వద్ద వాహనాల తనిఖీలో భాగంగా పోలీసులు వాహనాలను ఆపి తని ఖీలు చేస్తున్న సమయం లో అనుమానా స్పదంగా వ్యక్తి కనిపించడం తో అట్టి వ్యక్తిని అదుపులోకి తీసు కొని విచారించగా అతను కోరుట్ల పట్టణానికి చెందిన కండ్లె బాపన్న భార్య పిల్లలతో ఉంటూ కూలి నాలి చేసుకుంటూ జీవితం గడిపే వాడని అట్టి సంపా దన సరిపోక అతడు ద్విచక్ర వాహనాలను దొంగ తనాలు చేయడం మొదలు పెట్టి ఇంతకు ముందే వాహనాల కేసులో పట్టు బడ్డాడని ఇతను పై ఇంతకు ముందే కేసులు ఉన్నట్లు కండ్లె బాపన్న అనే వ్యక్తి నేరం ఒప్పుకోవడం జరిగిందని దొంగతనంగా బైకులను ఎత్తుకెళ్లిన పది ద్విచక్ర వాహనాలను మంచిర్యాల జిల్లా మండలం లక్షట్ పేట గంపలపెల్లి గ్రామం లో 10 ద్విచక్ర వాహనాలను దాచి పెట్టినట్లు అందరితో నేను మెకానికునని చెప్పు కుంటూ మహారాష్ట్ర లోని ఒక వ్యక్తికి 10 ద్విచక్ర వాహనాలను ఒకేసారి అమ్ముదామని అనుకున్న సమయంలోనే ఈ దొంగ పట్టుబడ్డాడని ఇతడు పలు జిల్లాల లో ద్విచక్ర వాహ నాలను దొంగతనం చేసి నట్లు నేరం ఒప్పుకు న్నాడని ఇతడు కరీంనగర్, కోరుట్ల, చొప్పదండి, నిర్మల్ పలు జిల్లాలలో దొంగ తనాలు చేసినట్లు రుజు వైందని తేదీ 6.11.2026 రోజున రాజయ్య అనే వ్యక్తి తన యొక్క బైకు పోయిందని





పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా అట్టి కేసు పై విచారిస్తున్న సమయం లోనే ఇట్టి దొంగ దొరికాడని కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించి నట్లు ఏసీపీ గజ్జి కృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమం లో పెద్దపల్లి సీఐ కె ప్రవీణ్ కుమార్, ధర్మారం ఎస్సైఎంబడి శ్రీకాంత్,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.ఈ సంద ర్భంగా అంతర్ జిల్లాల ద్విచక్ర వాహనాల దొంగను పట్టు కున్న సందర్భంగా ఏసీపీ గజ్జి కృష్ణ పోలీసు సిబ్బంది కి రివార్డులను అందజేసి పోలీస్ సిబ్బందిని అభి నందించారు.

వైరా ఎస్సై ప్రవీణ్ కుమార్ ను కలిసిన వైరా ప్రెస్ క్లబ్ నూతన కమిటీ



తల్లాడ నవంబర్ 10 ప్రజా కలం న్యూస్ వైరా పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్ గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆర్. ప్రవీణ్ కుమార్ ను వైరా ప్రెస్ క్లబ్ నూతన కమిటీ మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం వైరా పోలీస్ స్టేషన్ లో ఎస్సైను వైరా ప్రెస్ క్లబ్ అధ్యక్షులు దేవబత్తిని సీతారాములుతో పాటు నూతన కార్యవర్గం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు స్వీట్ తినిపించి శాలువాతో సన్మానించి సత్కరించారు. అనంతరం ఎస్సై మాట్లాడుతూ మండలంలో ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. పేకాట, జూదం, గంజాయి లాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఊరుకోనని హెచ్చరించారు. వైరా మండలంలో రాజకీయ నాయకులు, ప్రజా ప్రతినిధులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో

క్లబ్ గౌరవాధ్యక్షులు ఓర్సు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి షేక్ షాకీర్, ఉపాధ్యక్షులు వాకదాని శ్రీకాంత్, మామిళ్ళపల్లి విజయ్, గొడ్ల నరసింహారావు, తుప్పతి రవికుమార్ , సత్తెనపల్లి నరసింహారావు, నారపోగు ప్రసాద్, ఇస్సనాపల్లి కృష్ణ.ఉన్నారు

అభివృద్ధి పనులను ఎలాంటి జాప్యం లేకుండా

త్వరితగతిన పూర్తి చేయాలి

- అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) మధుసూధన్ నాయక్



మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి నవంబర్ 10:

సాంఘిక సంక్షేమ వసతి గృహాలు, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో (కె.జి.బి. వి) ఇప్పటికే మంజూరైన అన్ని అభివృద్ధి పనులను ఎలాంటి జాప్యం లేకుండా త్వరితగతిన పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) మధుసూధన్ నాయక్ సంబంధిత అధికారులను ఆదేశించారు.మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం లోని ఆయన ఛాంబర్ లో డిప్యూటీ డైరెక్టర్ (ఎస్సీ సంక్షేమం), కెజి.బి.వి ప్రత్యేక అధికారులు (ఎస్.ఓ.లు), వసతి గృహ సంక్షేమ అధికారులు (వార్డెన్లు), ఈఈ (ఈడబ్ల్యూఐడిసి), డీఈఈ, ఏఈఈలు పరస్పర సమన్వయంతో పనిచేసి అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు.మంజూరైన పనుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని, క్షేత్రస్థాయిలో పనుల నాణ్యతను పరిశీలించాలని ఆదేశించారు. పనుల అమలులో ఎదురవుతున్న సమస్యలను వెంటనే పరిష్కరించి, విద్యార్థులకు మెరుగైన వసతి, మౌలిక సదుపాయాలు కల్పించేలా మరమ్మతులు, అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేసేలా సంబంధిత శాఖల అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.

విద్యార్థులకు క్లాత్స్ క్లిప్స్ పంపిణీ...విద్యార్థులు ఉతికిన దుస్తులను ఆరబెట్టుకునే సమయంలో ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, వారి సౌకర్యార్థం క్లాత్స్ క్లిప్స్‌ను పంపిణీ చేశారు.ఈ సమావేశంలో జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారిణి సునీత, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కరువు కారణంగా పంటలు ఎండిపోతున్నాయి..

రైతులను ఆదుకోవాలి

ఎకరానికి రూ.30 వేల పంట నష్టపరిహారం చెల్లించాలి

కలెక్టరేట్ ఎదుట సీపీఐ, ఏఐటీయూసీ ధర్నా



జగిత్యాల ప్రతినిధి నవంబర్ 10 (ప్రజా కలం)

కరువు పరిస్థితుల కారణంగా పంటలు ఎండిపోయి రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే స్పందించి రైతులను ఆదుకోవాలని తెలంగాణ రాష్ట్ర ఏఐటీయూసీ కౌన్సిల్ సభ్యుడు, సీపీఐ జగిత్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి చెన్న విశ్వనాథం, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఏశమేని గణేష్ డిమాండ్ చేశారు.మంగళవారం జగిత్యాల జిల్లా కలెక్టరేట్ ఎదుట సీపీఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో రైతుల సమస్యలపై ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వర్షాభావ పరిస్థితులు, కరువు కారణంగా పంటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సాగు కోసం వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టిన రైతులకు పంట నష్టం మరింత భారంగా మారిందన్నారు. పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే గుర్తించి ఎకరానికి రూ.30 వేల చొప్పున పంట నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం కరువు నివారణ చర్యలు చేపట్టి వ్యవసాయ రంగాన్ని ఆదుకునేందుకు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలని కోరారు. పంటల బీమా పథకాన్ని సమర్థవంతంగా అమలు చేసి నష్టపోయిన రైతులకు బీమా పరిహారం అందించాలని, రాష్ట్ర ప్రభుత్వం క్షేత్రస్థాయిలో సమగ్ర పంట నష్టం సర్వే నిర్వహించి బాధిత రైతులకు తక్షణ సహాయం అందించాలని అన్నారు.రైతుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచుతామని, నష్టపోయిన రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని చెన్న విశ్వనాథం, ఏశమేని గణేష్ స్పష్టంచేశారు.ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు సుతారి రాములు, ఇరుగురాల భూమేశ్, మునుగూరి హనుమంతు, ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి ఎండి ముక్రం, జగిత్యాల జిల్లా మున్సిపల్ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి ఎండి ఉస్మాన్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎండి అక్రం, భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు రామిల్ల రాంబాబు, గంగానర్సయ్య, అందె వంశీ, మాడిశెట్టి కిరణ్, వెన్న సురేశ్, రాధక్క తదితరులు పాల్గొన్నారు.

తల్లాడ మండలం కొత్త వెంకటగిరి గ్రామ సర్పంచ్ దీవెల వెంకటేశ్వరరావు



తల్లాడ నవంబర్ 10 ప్రజా కలం న్యూస్

మంగళవారం సత్తుపల్లి శాసనసభ్యురాలు మట్ట రాగమయి గారిని,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ గారిని తల్లాడ మండలం కొత్త వెంకటగిరి గ్రామ సర్పంచ్ దీవెల వెంకటేశ్వరరావు కలిశారు. ఈ సందర్భంగా కొత్త వెంకటగిరి గ్రామానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసినందుకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం సత్తుపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్గా నియమతులైన చల్లగుండ్ల నరసింహారావు కి ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియజేశారు సత్తుపల్లి నియోజకవర్గం వర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు నిరంతరం శ్రమిస్తామని ఎమ్మెల్యే రాగమయి గారు ,రాష్ట్ర నాయకులు దయానంద్ విజయకుమార్ గారు అన్నారు ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి గోవింద్ శ్రీనివాసరావు ,మండల నాయకులు పడాల లచ్చిరెడ్డి , కొత్త వెంకటగిరి గ్రామ ఉపసర్పంచ్ రామకృష్ణ చారీ , కొలిపాక వెంకటరమయ్య , తల్లాడ మండలం సోషల్ మీడియా కోఆర్డినేటర్ విజయ్ తదితరులు పాల్గొన్నారు

జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారిగా ఎం. చత్రు బాధ్యతల స్వీకరణ

మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి నవంబర్ 10:

మహబూబ్‌నగర్ జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి (డిస్ట్రిక్ట్ ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్) ఎం. చత్రు, జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారిగా పూర్తి అదనపు బాధ్యతలు (ఎఫ్.ఏ.ని.) స్వీకరించారు. మంగళవారం జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ కార్యాలయంలో ఆయన అధికారికంగా బాధ్యతలు చేపట్టారు.ఈ సందర్భంగా ఎం. చత్రు మాట్లాడుతూ, తనపై విశ్వాసంతో మైనార్టీ సంక్షేమ శాఖ అదనపు బాధ్యతలు అప్పగించిన జిల్లా కలెక్టర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం మైనార్టీల సంక్షేమం కోసం అమలు చేస్తున్న వివిధ పథకాలు, కార్యక్రమాలను అర్హులైన లబ్ధిదారులకు సమర్థవంతంగా చేరవేసేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. శాఖ ద్వారా అమలవుతున్న సంక్షేమ పథకాల విషయంలో పారదర్శకత, జవాబుదారీతనం పాటిస్తూ, ఎలాంటి ఫిర్యాదులకు అస్కారం లేకుండా విధులు నిర్వహిస్తానని తెలిపారు.మైనార్టీ సంక్షేమ శాఖ జిల్లా అధికారిగా బాధ్యతలు స్వీకరించడం తనకు ఇదే మొదటిసారి అని పేర్కొన్న ఆయన, ఈ బాధ్యతలను ఒక అవకాశంగా భావించి పూర్తి నిబద్ధత, అంకితభావంతో పనిచేస్తానని, జిల్లా కలెక్టర్ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని స్పష్టం చేశారు.అంతకుముందు జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ సూపరింటెండెంట్ శ్రీమతి విజయలక్ష్మి నూతనంగా బాధ్యతలు స్వీకరించిన అధికారి శ్రీ ఎం. చత్రుకు స్వాగతం పలికి, కార్యాలయ సిబ్బందిని పరిచయం చేశారు.



కానిస్టేబుల్ కుటుంబానికి పోలీస్ శాఖ ఆర్థిక భరోసా

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఏఆర్ కానిస్టేబుల్ రామస్వామి కుటుంబానికి రూ.5 లక్షల బీమా చెక్కు అందజేత



నాగర్ కర్నూల్ నవంబర్ 10 (ప్రజా కలం): విధి నిర్వహణలో ఉన్నా, అనుకోని ప్రమాదాల కారణంగా ప్రాణాలు కోల్పోయిన పోలీస్ సిబ్బంది కుటుంబాలకు అండగా నిలవడమే పోలీస్ శాఖ లక్ష్యమని జిల్లా ఎస్పీ డా. సంగ్రామ్ సింగ్ జి. పాటిల్, ఐపీఎస్ పేర్కొన్నారు.రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఏఆర్ కానిస్టేబుల్ రామస్వామి కుటుంబానికి పోలీస్ భద్రత వెల్ఫేర్ అసోసియేషన్ మంజూరు చేసిన రూ. 5 లక్షల పర్సనల్ ఇన్సూరెన్స్ బీమా చెక్కును మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఎస్పీ కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ శాఖలో పనిచేస్తున్న ప్రతి ఒక్కరి సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. అకాల మరణం చెందిన పోలీస్ సిబ్బంది కుటుంబాలను ప్రభుత్వం, పోలీస్ శాఖ తరఫున అన్ని విధాలా ఆదుకునేందుకు కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. కానిస్టేబుల్ రామస్వామి పోలీస్ శాఖకు అందించిన సేవలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు.పోలీస్ సిబ్బంది కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కోకుండా సంక్షేమ కార్యక్రమాల ద్వారా భరోసా కల్పించేందుకు పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఏఓ కృష్ణయ్య, ఆర్ఎస్ఐ గౌస్ పాషా, పోలీస్ కోఆర్డినేటర్ గోలి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దేశవ్యాప్తంగా రైతుల అప్పులను ఏకకాలంలో మాఫీ చేయాలి

రైతాంగాన్ని రుణ విముక్తులను చేయాలి - తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. శ్రీనివాసులు



నాగర్‌కర్నూల్ నవంబర్ 10 (ప్రజా కలం): దేశవ్యాప్తంగా రైతులు తీసుకున్న అన్ని రకాల అప్పులను కేంద్ర ప్రభుత్వం ఏకకాలంలో మాఫీ చేసి రైతాంగాన్ని రుణ విముక్తులను చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. శ్రీనివాసులు డిమాండ్ చేశారు. నల్లగొండలో నవంబర్ 15 నుంచి 18 వరకు నిర్వహించనున్న అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) 36వ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ తెలంగాణ రైతు సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో జీపు జాతను ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా రైతాంగం తీవ్ర అప్పుల ఊబిలో కూరుకుపోయిందని, రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లభించక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. కార్పొరేట్ సంస్థలకు, పారిశ్రామికవేత్తలకు లక్షల కోట్ల రూపాయల రుణాలు మాఫీ చేస్తూ, సబ్సిడీలు అందిస్తున్న కేంద్ర ప్రభుత్వం రైతుల రుణమాఫీకి నిధులు లేవని చెప్పడం సరైంది కాదని విమర్శించారు. దేశంలోని రైతులందరికీ బ్యాంకు రుణాలతో పాటు ఇతర వ్యవసాయ అప్పులను కూడా ఏకకాలంలో మాఫీ చేయాలని డిమాండ్ చేశారు.నవంబర్ 15, 16, 17, 18 తేదీల్లో నల్లగొండ జిల్లా కేంద్రంలో ఏఐకేఎస్ 36వ అఖిల భారత మహాసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. నవంబర్ 15న నల్లగొండ పట్టణంలో లక్ష మందితో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సభకు సీపీఎం సీనియర్ జాతీయ నాయకురాలు బృందా కారత్, ఏఐకేఎస్ అఖిల భారత ప్రధాన కార్యదర్శి విజ్జూ కృష్ణన్, అఖిల భారత అధ్యక్షుడు అశోక్ ధావలే, రాష్ట్ర కార్యదర్శి టి.సాగర్,అధ్యక్షుడు పోతినేని సుదర్శన్, మహాసభల ఆహ్వాన కమిటీ అధ్యక్షుడు, మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి తదితరులు హాజరవుతారని వివరించారు. దేశవ్యాప్తంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై మహాసభల్లో విస్తృతంగా చర్చించి, భవిష్యత్తులో చేపట్టాల్సిన రైతాంగ ఉద్యమాలకు కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపారు. వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పగించే ప్రయత్నాలను అడ్డుకొని, వ్యవసాయ రంగాన్ని, రైతాంగాన్ని రక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ మహాసభలకు నాగర్‌కర్నూల్ జిల్లా నుంచి రైతులు, వ్యవసాయ కార్మికులు, మహిళలు, విద్యార్థులు, ప్రజలు వేలాదిగా తరలిరావాలని పిలుపునిచ్చారు.

జిల్లాలోని 20 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలి

నాగర్‌కర్నూల్ జిల్లాలో మొత్తం 20 మండలాలు ఉండగా, కొన్ని మండలాలను మాత్రమే కరువు మండలాలుగా ప్రకటించడం వల్ల మిగతా ప్రాంతాల రైతులకు అన్యాయం జరుగుతోందని శ్రీనివాసులు అన్నారు. జిల్లా కలెక్టర్, జిల్లా మంత్రులు తక్షణమే స్పందించి జిల్లాలోని మొత్తం 20 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని, యుద్ధప్రాతిపదికన కరువు సహాయక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన యూరియా బుకింగ్ యాప్‌ను వెంటనే రద్దు చేయాలని, సీసీఐ తీసుకొచ్చిన కపాస్ కిసాన్ యాప్‌ను ఉపసంహరించుకోవాలని కోరారు. 60 ఏళ్లు నిండిన రైతులందరికీ నెలకు రూ.5 వేల పెన్షన్ ఇవ్వాలని, రైతులకు బ్యాంకుల ద్వారా పంట రుణాలు అందించాలని, రాష్ట్రవ్యాప్తంగా దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆర్. శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు వి. పర్వతాలు, మహిళా సంఘం జిల్లా కార్యదర్శి కే. గీత, నాగర్‌కర్నూల్ మాజీ ఎంపీటీసీ యాదయ్య, సీఐటీయూ జిల్లా కోశాధికారి పి. రామయ్య, నాగర్‌కర్నూల్ సీపీఎం మండల కార్యదర్శి ఎన్. మధు, బిజినపల్లి కార్యదర్శి జి. అశోక్, తాడూరు కార్యదర్శి అంతటి కాశన్న, రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు సి. బాల్‌రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు వి. వెంకటేష్, కృష్ణారెడ్డి, జిల్లా నాయకులు రమణారెడ్డి, వై. నాగేంద్రం, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులను కలిగిస్తే కఠిన చర్యలు

ధర్మారం : రైతులను ఇబ్బందులకు గురిచేసిన వారిపై కఠిన చర్యలు ఉంటాయని మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అధికారులను హెచ్చరించారు. మల్లాపూర్‌లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు కావాల్సిన అన్ని సౌకర్యాలు కల్పించాలని కోరారు. సెంటర్లలో ధాన్యం నిల్వ ఉండకుండా త్వరగా కొనుగోలు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. రైతులపై నిర్లక్ష్యంగా వ్యవహరించిన, వారిని ఇబ్బందులకు గురి చేసిన సహకార సంఘాల సీఈఓలతో పాటు అధికారులను సస్పెండ్ చేయడానికి వెనుకాడనని హెచ్చరించారు. ధాన్యం అమ్మిన మూడు నాలుగు రోజుల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమయ్యే విధంగా ప్రభుత్వం చర్యలు చేపడుతుందని తెలిపారు. పత్తిపాక సింగిల్‌విండో చైర్మన్ నోముల నర్సింహారెడ్డి, మండల అధ్యక్షుడు లావుడ్య రూప్లానాయక్, డీసీసీ జనరల్ సెక్రెటరీ గాగిరెడ్డి తిరుపతి రెడ్డి, డీసీసీ సెక్రెటరీ కొత్త నర్సింహులు, పార్టీ సీనియర్ నాయకులు చింతల ప్రదీప్‌రెడ్డి, మల్లాపూర్ సర్పంచ్ మంద శ్రీనివాస్, డైరెక్టర్లు బద్దం రవీందర్ రెడ్డి, లింగారెడ్డిలు, గంధం మహిపాల్, గంధం మల్లయ్య పాల్గొన్నారు.

చిన్నారుల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు తల్లిపాలు,

పౌష్టికాహారం ఎంతో కీలకం



– జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా

మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి నవంబర్ 10:

చిన్నారుల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు తల్లిపాల ప్రాధాన్యత, పౌష్టికాహారం, వ్యక్తిగత పరిశుభ్రత, పిల్లల అభివృద్ధి దశలపై తల్లులకు విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు. చిన్నారుల్లో ఎదుగుదల లోపాలను ప్రాథమిక దశలోనే గుర్తించి, అవసరమైన వైద్య చికిత్స అందించేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. జాతీయ పోషణ మాసం (పోషణ్ మాహ్) కార్యక్రమంలో భాగంగా మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా స్టేట్ హోమ్‌లో 'మన అంగన్‌వాడీ – మన బాధ్యత' అనే థీమ్ తో నిర్వహించిన ఆరోగ్యలక్ష్మి (సప్లిమెంటరీ న్యూట్రిషన్ ప్రోగ్రాం), అవగాహన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారుల తల్లులు, అంగన్‌వాడీ కార్యకర్తలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు.శిశువు జన్మించినప్పటి నుంచి మొదటి ఆరు నెలల వరకు తల్లిపాలు మాత్రమే అందించాలని కలెక్టర్ సూచించారు. తల్లిపాలు శిశువుకు అవసరమైన పోషకాలను అందించడంతో పాటు రోగనిరోధక శక్తిని పెంపొందిస్తాయని తెలిపారు. తల్లిపాలు తగినంతగా ఉత్పత్తి కావాలంటే బాలింతలు పౌష్టికాహారం తీసుకోవడంతో పాటు తమ ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలన్నారు. గర్భిణులు వైద్యుల సూచనల మేరకు ఐరన్, కాల్షియం మాత్రలను క్రమం తప్పకుండా తీసుకోవాలని, పోషక విలువలున్న ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. ఆరు నెలల తర్వాత తల్లిపాలతో పాటు చిన్నారులకు అదనపు పోషకాహారం అందించాలని, రెండేళ్ల వయస్సు వరకు తల్లిపాలను కొనసాగించాలని తెలిపారు. రెండేళ్లలోపు పిల్లలకు అధిక ఉప్పు, చక్కెర కలిగిన పదార్థాలు, ప్యాకెట్ ఆహారాలు, శీతల పానీయాలు ఇవ్వకూడదని స్పష్టం చేశారు. అరటిపండ్లు, చిరుధాన్యాలతో తయారు చేసిన జావ, పప్పులు, కూరగాయలు వంటి సహజసిద్ధమైన పోషకాహారం అందించాలని సూచించారు. పుట్టినరోజు వేడుకలు, శుభకార్యాలు, పాఠశాలల్లో పిల్లలు చిప్స్, చాక్లెట్లు, శీతల పానీయాలకు అలవాటు పడుతున్నారని, వీటిని తరుచూ తీసుకోవడం వల్ల వారి ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడే ప్రమాదం ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. తల్లిదండ్రులు ఇంట్లో తయారుచేసిన ఆరోగ్యకరమైన ఆహారాన్ని పిల్లలకు అందించడంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం గుడ్లు, అన్నం, పప్పు, కూరగాయలు తదితర ఆహార పదార్థాలను నాణ్యతతో, తగిన పరిమాణంలో అందించాలని కార్యకర్తలకు సూచించారు. పప్పులో బీరకాయ, పాలకూర, గోంగూర, మెంతికూర వంటి ఆకుకూరలు, కూరగాయలు కలిపి వండడం ద్వారా పోషక విలువలు పెరుగుతాయని తెలిపారు. పిల్లలు ఆహారం తినడం లేదనే కారణంతో దాని నాణ్యత, పోషక విలువల్లో రాజీ పడకూడదని స్పష్టం చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే ఆహార నాణ్యతను అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రీ ప్రైమరీ విద్య బాధ్యతలు విద్యాశాఖకు బదిలీ అయినప్పటికీ, చిన్నారులకు పోషకాహారం అందించే బాధ్యత మహిళా, శిశు సంక్షేమ శాఖపైనే కొనసాగుతుందని కలెక్టర్ తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్తలు తమ కేంద్రాలకు వచ్చే చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు సరైన పోషకాహారంపై అవగాహన కల్పించాలని సూచించారు. అంగన్‌వాడీ సిబ్బంది చెప్పే విషయాలకు తల్లిదండ్రులు ప్రాధాన్యత ఇస్తారని, అందువల్ల ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. చిన్నారుల్లో వయస్సుకు అనుగుణంగా శారీరక, మానసిక ఎదుగుదల జరుగుతోందా లేదా అన్నది తల్లిదండ్రులు, అంగన్‌వాడీ కార్యకర్తలు నిరంతరం గమనించాలని కలెక్టర్ సూచించారు. చిరునవ్వు, కంటిచూపుతో స్పందించడం, శబ్దాలకు ప్రతిస్పందించడం, మాటలు పలకడం, నిలబడటం, నడవడం వంటి అభివృద్ధి లక్షణాలను పరిశీలించాలన్నారు. నిర్ణీత వయస్సులో ఈ లక్షణాలు కనిపించకపోతే నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలని తెలిపారు. అవసరమైన వైద్య పరీక్షలు, చికిత్సలు, ప్రత్యేక శిక్షణ ద్వారా ఎదుగుదల సమస్యలను అధిగమించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లిదండ్రులు సమన్వయంతో పనిచేస్తూ చిన్నారుల ఆరోగ్యం, పోషణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు. కేంద్రాల్లో ఏవైనా సమస్యలు, లోపాలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని, అధికారులు, సిబ్బంది సమన్వయంతో వాటిని పరిష్కరించాలని సూచించారు.అనంతరం తల్లి, బిడ్డల ఆరోగ్యాన్ని ఆకాంక్షిస్తూ నిర్వహించిన శ్రీమంతం కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని గర్భిణులు, చిన్నారుల తల్లులకు పండ్లు, పూలు, గాజులు, చీరలను అందజేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలతో పోషణ ప్రతిజ్ఞ చేయించారు. ప్రతి ఇంటికీ సరైన పోషణ, పౌష్టికాహారం, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తూ పోషణ అభియాన్‌ను దేశవ్యాప్త ప్రజా ఉద్యమంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన పౌష్టికాహార ప్రదర్శనను కలెక్టర్ సందర్శించి, వివిధ రకాల పోషక విలువలున్న ఆహార పదార్థాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి జరీనా బేగం, సి.డి.పి.ఓ లు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు, చిన్నారుల తల్లులు తదితరులు పాల్గొన్నారు.

రైతులు వరి కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

ఐదు గ్రామాల్లో కేంద్రాలు ప్రారంభించిన ఎమ్మెల్యే పవార్ రామారావ్ పటేల్

దేగాం గ్రామం లో పలు అభివృద్ధి పనులు ప్రారంభం



నిర్మల్ నవంబర్ 10
(ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

రైతులు వరి కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పవార్ రామారావ్ పటేల్ గారు సూచించారు. మంగళవారం బైంసా మండలంలోని దేగాం, వాలెగాం, కుంసర, కామోల్, వానల్పాడ్, తిమ్మాపూర్, గ్రామాల్లో ఐకెపి ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. బహిరంగ మార్కెట్లో ధర తక్కువగా ఉంటే రైతాంగానికి మద్దతు ధర కల్పించేందుకు ఈ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఏ గ్రేడ్ రకం వరికి క్వింటాలకు 2461రూపాయల ధర, బి గ్రేడ్ రకం క్వింటాలుకు 2441 రూపాయల ధర, 7 సన్న రకాలకు అదనంగా క్వింటాలుకు 500 బోనస్ ఉంటుందన్నారు. కొనుగోలు కేంద్రాల ప్రారంభించి, ఆయన రైతులను సన్మానించారు. ఎల్. ని నో ప్రభావంతో రైతులు నష్టాల్లో ఉన్నారని, ప్రభుత్వం రైతు భరోసా నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

దేగాం గ్రామంలో పలు అభివృద్ధి పనులు ప్రారంభం....

దేగాం గ్రామంలో ఎమ్మెల్యే పవార్ రామారావ్ పటేల్ గారు పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. పెద్దమ్మ తల్లి ఆలయం వద్ద 10 లక్షల రూపాయల నిధులతో నిర్మించనున్న కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ఆయన భూమి పూజ చేశారు. అదేవిధంగా 10 లక్షల రూపాయల నిధులతో నిర్మించిన మహిళా షెడ్డు భవనాన్ని ప్రారంభించారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో చిత్తబుట్టలను పంపిణీ చేశారు. అంతకుముందు బిజెపి నాయకులు కిష్టయ్య కుమారుని వివాహం కావడంతో వారింటికి వెళ్లి వధూవరులను ఆశీర్వదించారు.

కామోల్ లో బిజెపి నాయకునికి పరామర్శ...

ఇటీవల రోడ్డు ప్రమాదంలో గ్రామానికి చెందిన బిజెపి నాయకుడు భోజరెడ్డి గాయపడంతో వారిని ఎమ్మెల్యే పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమాల్లో మాజీ ఎంపీపీ అబ్దుల్ రజాక్, మాజీ జడ్పీటీసీ సోలంకే భీమ్రావు, బైంసా మండల బిజెపి అధ్యక్షురాలు దేగాం సర్పంచ్ సిరం సుష్మారెడ్డి, సర్పంచ్లు అశోక్, చిన్నయ్య, నాగలక్ష్మివినోద్, సంజీవ్ , కుంసర సర్పంచ్, గంగాధర్ పటేల్, అశోక్, సుధాకర్, చందర్ పటేల్, మండల సీనియర్ నాయకులు, కార్యకర్తలు , రైతులు పాల్గొన్నారు.

శ్రీ కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా కల్లు, మద్యం దుకాణాల మూసివేత : జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా

మహబూబ్ నగర్ ప్రజాకలం ప్రతినిధి నవంబర్ 10:శ్రీ కురుమూర్తి స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు–2026ను పురస్కరించుకుని జాతర ప్రశాంత వాతావరణంలో నిర్వహించడంతో పాటు శాంతిభద్రతల పరిరక్షణకు ముందస్తు చర్యల్లో భాగంగా జాతర పరిసర ప్రాంతాల్లో కల్లు, మద్యం దుకాణాలను మూసివేయాలని జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ శ్రీమతి ఖుష్బూ గుప్తా ఆదేశాలు జారీ చేశారు.తెలంగాణ అబ్కారీ చట్టం–1968లోని సెక్షన్ 20(1) ప్రకారం ఈ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు.

ఈ ఉత్తర్వుల ప్రకారం 2026 నవంబర్ 10వ తేదీ ఉదయం 5 గంటల నుంచి నవంబర్ 25వ తేదీ రాత్రి 10 గంటల వరకు కురుమూర్తి స్వామి జాతర ప్రాంగణంతో పాటు దాని చుట్టూ ఐదు కిలోమీటర్ల పరిధిలోని గ్రామాల్లో కల్లు దుకాణాలు, ఎ–4 మద్యం దుకాణాలను పూర్తిగా మూసివేయాల్సి ఉంటుంది. ఈ నిషేధాజ్ఞలు చిన్నచింతకుంట, దేవరకద్ర మండలాల పరిధిలోని అమ్మాపూర్, దుప్పల్లి, తిరుమలాపూర్, పడ్డమాన్, అల్లిపూర్, కురుమూర్తి, అప్పంపల్లి, పేరూర్ గ్రామాలకు వర్తిస్తాయని కలెక్టర్ స్పష్టం చేశారు. జాతరకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఉత్తర్వులను కఠినంగా అమలు చేయాలని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని సంబంధిత ఎక్సైజ్, పోలీస్ అధికారులను ఆదేశించారు. శ్రీ కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు భక్తులు, ప్రజలు, వ్యాపారులు సంబంధిత అధికారులకు సహకరించాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

అక్రెడిటేషన్ కార్డుల జారీ ప్రక్రియ పారదర్శకంగా చేపట్టాలి

నిబంధనలు ఉల్లంఘిస్తే కార్డుల రద్దు తప్పదు: జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా

నిర్మల్ నవంబర్ 10 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

జిల్లాలో అక్రెడిటేషన్ కార్డుల జారీ ప్రక్రియను ప్రభుత్వ నిబంధనల ప్రకారం పూర్తి పారదర్శకంగా చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో జిల్లా అక్రెడిటేషన్ కమిటీ మూడో విడత సమావేశాన్ని కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా అందిన దరఖాస్తులను పరిశీలించి, అర్హతలు, నిబంధనల అమలుపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజాస్వామ్య పరిరక్షణతో పాటు ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో మీడియా కీలక పాత్ర పోషిస్తోందన్నారు. జర్నలిస్టులు వృత్తి నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతిరోజూ దినపత్రికల ప్రచురణ, హాజరు వివరాలు తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా కార్డులు పొందినట్లు గుర్తిస్తే వాటిని రద్దు చేస్తామని తెలిపారు. అక్రెడిటేషన్ కార్డులను దుర్వినియోగం చేయడం,



వంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు కార్డులను వెనక్కి తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో అక్రెడిటేషన్ కన్వీనర్ మెంబర్, డి పి ఆర్ ఓ ఇ. విష్ణువర్ధన్, కమిటీ సభ్యులు అల్వాల హనుమంతు, రవీందర్, మహేష్, రాజేశ్వర్, అశోక్, నాగరాజు, వసీం, ప్రేమ్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అసంపూర్తిగా ఉన్న రెండు పడక గదుల ఇళ్లను ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు అందించాలి

– లబ్ధిదారుల ఎంపిక పూర్తి పారదర్శకంగా చేపట్టాలి : జిల్లా కలెక్టర్ దివాకర టి ఎస్

ఖమ్మం నవంబర్ 10(ప్రజా కలం న్యూస్)

ఖమ్మం జిల్లాలో వివిధ దశల్లో అసంపూర్తిగా నిలిచిపోయిన రెండు పడక గదుల ఇళ్ల ను యథాస్థితిలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు అందజేతకు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. మంగళవారం క్షేత్రస్థాయిలో వలు మండలాల్లోని రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణాలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. నేలకొండపల్లి మండలం గువ్వలగూడెం గ్రామంలో 30, సింగిరెడ్డిపాలెం గ్రామంలో 48, శంకరగిరి తండా గ్రామంలో 30, కూసుమంచి మండలం మల్లెపల్లి గ్రామంలో 16, ఖమ్మం అర్బన్ మండలం దంసలాపురంలో 192 అసంపూర్తిగా ఉన్న రెండు పడక గదుల ఇళ్లను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర్ మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాలను ప్రస్తుతం ఏ దశలో ఉన్నాయో అదే స్థాయి నుంచి పూర్తి చేసుకునేందుకు అంగీకారంతో ఉన్న ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను గుర్తించి వారికి



కేటాయించవలసిందిగా అధికారులను ఆదేశించారు.

లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా, పూర్తిగా పారదర్శకమైన విధానాన్ని అవలంబించాలని తెలిపారు. ఇళ్ల సముదాయాల వద్ద విద్యుత్, శానిటరీ, త్రాగునీటి సరఫరా తదితర మౌలిక సదుపాయాల కల్పనకు ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. కలెక్టర్ పర్యటన సందర్భంగా హౌజింగ్ పిడి భూక్యా శ్రీనివాస్, తహశీల్దార్ లు రాంప్రసాద్, సైదులు, విజయేందర్ రెడ్డి, జయచంద్ర, హౌజింగ్ డీఈ కె. జగ్రామ్, ప్రజాప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ పాలనలో పాలమూరుకు అన్యాయం



పాలమూరు అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట

కొడంగల్‌లో రూ.9 వేల కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం..

సాగునీరు, పరిశ్రమలు, విద్యారంగ అభివృద్ధికి ప్రాధాన్యం

బీఆర్ఎస్ పాలనలో పశ్చిమ మహబూబ్‌నగర్‌కు తీవ్ర అన్యాయం జరిగింది

ప్రజా సంక్షేమమే మా ప్రభుత్వ ప్రధాన లక్ష్యం: ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి

మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి నవంబర్ 10: పాలమూరు ప్రాంత అభివృద్ధి, రైతుల సంక్షేమం, సాగునీటి సదుపాయాల కల్పన, పారిశ్రామికాభివృద్ధి, విద్యారంగ విస్తరణకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే లియెన్నం శ్రీనివాస్ రెడ్డి లి అన్నారు. సీఎల్పీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కొడంగల్‌లో ముఖ్యమంత్రి లి రేవంత్ రెడ్డి లి రూ.9,000 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయడంతో పాటు రైతు పండుగ నిర్వహించారని తెలిపారు. తన పుట్టినరోజును కుటుంబ సభ్యుల మధ్య జరుపుకున్న అనంతరం, మిగిలిన సమయాన్ని ప్రజా అభివృద్ధి కార్యక్రమాలకు కేటాయించారని పేర్కొన్నారు. పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకం మూల వనరును జూరాల నుంచి శ్రీశైలం బ్యాక్‌వాటర్స్‌కు మార్చడం ద్వారా గత బీఆర్ఎస్ ప్రభుత్వం పశ్చిమ మహబూబ్‌నగర్ ప్రాంతానికి తీవ్ర అన్యాయం చేసిందని ఆయన విమర్శించారు. రూ.2,000 కోట్ల అంచనా వ్యయంతోమక్తల్–నారాయణపేట–కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించామని, లక్ష ఎకరాలకు సాగునీరు అందించడమే లక్ష్యంగా పనులను వేగవంతం చేశామని తెలిపారు. ఉద్దండాపూర్ రిజర్వాయర్ భూసేకరణ కోసం రూ.600 కోట్లు విడుదల చేశామని, మక్తల్ వద్ద సంఘంబండ రిజర్వాయర్‌కు ఉన్న అడ్డంకులను తొలగించి నీటి విడుదలను పునరుద్ధరించామని వివరించారు. కృష్ణా జలాల్లో తెలంగాణ వాటాను 299 టీఎంసీలకే పరిమితం చేయడం ద్వారా గత ప్రభుత్వం రాష్ట్ర నీటి హక్కులకు నష్టం కలిగించిందని ఆరోపించారు. కొడంగల్ ప్రాంతంలో 5,000 ఎకరాల్లో ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు చేస్తున్నామని, భూములు అందిస్తున్న రైతులకు ఎకరాకు రూ.20 లక్షల పరిహారం అందించామని యెన్నం తెలిపారు. ఎల్‌అండ్‌టీ, బిర్లా వంటి ప్రముఖ సంస్థలు పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వస్తున్నాయని చెప్పారు. రూ.5,000 కోట్ల అంచనా వ్యయంతో 250 అడుగుల వెడల్పు, ఎనిమిది వరుసల ఎక్స్‌ప్రెస్‌వే నిర్మాణానికి ప్రణాళిక రూపొందించామని తెలిపారు. ఈ రహదారి అందుబాటులోకి వస్తే శంషాబాద్ విమానాశ్రయం నుంచి కొడంగల్ ఇండస్ట్రియల్ కారిడార్‌కు సుమారు గంటా పది నిమిషాల్లో చేరుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. నారాయణపేట–కొడంగల్ ప్రాంతంలో విద్యారంగ అభివృద్ధికి 250 ఎకరాల్లో మెడికల్, ఇంజనీరింగ్, అగ్రికల్చర్, పాలిటెక్నిక్ కళాశాలలతో ఎడ్యుకేషన్ హబ్ నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని యెన్నం తెలిపారు. ఈ విద్యా సంస్థల ద్వారా స్థానిక విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన భవిష్యత్తుకు అవసరమైన అవకాశాలు లభిస్తాయని అన్నారు. లక్ష కోట్ల రూపాయలతో మేడిగడ్డ ప్రాజెక్టు నిర్మించిన గత ప్రభుత్వం పాలమూరు పశ్చిమ ప్రాంతానికి పదేళ్లలో సాగునీరు అందించడంలో విఫలమైందని యెన్నం విమర్శించారు. 365 రోజుల్లో 300 రోజులు ఫామ్‌హౌస్‌కే పరిమితమైన కేసీఆర్, ముఖ్యమంత్రి గారు కొడంగల్‌లో మూడు రోజుల పర్యటన చేపడితే బీఆర్ఎస్ నాయకులు రాజకీయ విమర్శలు చేయడం సరికాదన్నారు. బీఆర్ఎస్ చేసిన అభివృద్ధి తక్కువని, ప్రచారం మాత్రం ఎక్కువగా చేసుకుందని ఎద్దేవా చేశారు. కరోనా సమయంలో అసెంబ్లీలో కరోనా ఏమీ లేదన్నట్లుగా వ్యవహరించిన కేసీఆర్ వైఖరి ప్రజల ప్రాణాలకు ముప్పు తెచ్చిందని యెన్నం విమర్శించారు. ప్రస్తుతం నీటి ఎద్దడి పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ముఖ్యమంత్రి లి రేవంత్ రెడ్డి లి ముందస్తు జాగ్రత్తలు సూచిస్తున్నారని తెలిపారు. ఇలాంటి కీలక అంశాలపై బీఆర్ఎస్ నాయకులు రాజకీయాలు చేయడం తగదన్నారు. కల్యాణలక్ష్మి, రైతు భరోసా, ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులతో పాటు ఆసుపత్రులకు లైన్ ఆఫ్ క్రెడిట్ నిధులను నిరంతరం ప్రజలకు అందిస్తున్నామని చెప్పారు. ప్రజల సంక్షేమం, ప్రాంతాల సమగ్ర అభివృద్ధి, రైతులకు సాగునీరు, యువతకు ఉపాధి అవకాశాల కల్పనే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని యెన్నం శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు.

మద్దిమడుగు గ్రామ అభివృద్ధికి పకడ్బందీ చర్యలు

– నెల రోజుల్లో భూ రీ సర్వే పూర్తి చేయాలి : కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్

నాగర్‌కర్నూల్ నవంబర్ 10 (ప్రజా కలం): మద్దిమడుగు గ్రామ సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించి పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ అధికారులను ఆదేశించారు. భూభారతి కార్యక్రమంలో భాగంగా గ్రామంలో చేపట్టిన భూ రీ సర్వే ప్రక్రియను నెల రోజుల్లోగా పూర్తి చేయాలని సూచించారు. మద్దిమడుగు గ్రామంలో నిర్వహించిన భూ రీ సర్వే అవగాహన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని అధికారులకు పలు సూచనలు చేశారు. అటవీ, రెవెన్యూ భూములకు సంబంధించి ఉన్న సరిహద్దు సమస్యలను సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పరిష్కరించాలని తెలిపారు. క్షేత్రస్థాయిలో భూముల సరిహద్దులను స్పష్టంగా గుర్తించి, పాత భూ రికార్డులు, మ్యాపులు, ఇతర ఆధారాలను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత పారదర్శకంగా సర్వే నిర్వహించాలని ఆదేశించారు. భూ రీ సర్వే సమయంలో గ్రామస్తుల అభిప్రాయాలు, అభ్యంతరాలను తప్పనిసరిగా పరిగణనలోకి తీసుకోవాలని, గ్రామస్తుల సమక్షంలోనే సర్వే ప్రక్రియ చేపట్టాలని సూచించారు. సర్వే పూర్తయిన అనంతరం మరోసారి గ్రామసభ నిర్వహించి ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరించాలని తెలిపారు. భవిష్యత్తులో భూ హక్కులకు సంబంధించి ఎలాంటి వివాదాలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గ్రామస్తులు తమ పట్టాదారు పాస్ పుస్తకాలు, భూ హక్కులకు సంబంధించిన పత్రాలను అధికారులకు అందించి సర్వేకు సహకరించాలని కోరారు. అదేవిధంగా మద్దిమడుగు గ్రామంలో సంత్ సేవాలాల్ మహారాజ్ విగ్రహ ఏర్పాటుకు అనువైన స్థలాన్ని గుర్తించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్యమంత్రి వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో అవసరమైన ఏర్పాట్లను ముందుగానే ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని సూచించారు. గ్రామ అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాలు, ఇతర ప్రాధాన్యత అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు తెలిపారు. అంతకుముందు మద్దిమడుగులోని శ్రీ పబ్బతి ఆంజనేయ స్వామి ఆలయంలో జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్, అధికారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. చెన్నయ్య, సబ్ కలెక్టర్ సలోని ఛాబ్ర, డీఎఫ్ఓ రేవంత్ చంద్ర, గ్రామ సర్పంచ్, రెవెన్యూ, అటవీ శాఖల అధికారులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కుకునూరు ఉన్నత పాఠశాలకు ఐడీ కార్డులు విరాళం ఇచ్చిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని నిహారిక

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) నవంబర్ 10:

నిజామాబాద్ జిల్లా వేల్పూర్ మండలంలోని కుకునూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులకు హైదరాబాద్‌లోని ఇన్ఫోసిస్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగినిగా పనిచేస్తున్న టి. నిహారిక తన సొంత జీతం డబ్బుల నుండి రూ. 8,000 విరాళం అందించి ఐడీ కార్డులను సమకూర్చారు. ఈ పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి. హరిచరణ్ గారి పెద్ద కుమార్తె అయిన నిహారిక, తన తండ్రి ద్వారా పాఠశాల



అవసరాలను తెలుసుకుని ఈ ఉదారతను చాటుకున్నారు. పాఠశాలలోని 102 మంది విద్యార్థులకు, 9 మంది ఉపాధ్యాయ బృందానికి మరియు అటెండర్ గంగమ్మకు ఆమె పూర్తిస్థాయిలో గుర్తింపు కార్డులను చేయించారు. మంగళవారం నిహారిక తన తల్లి కల్పన (రాఘవి), చెల్లెలు సాత్విక్‌లతో కలిసి పాఠశాలను సందర్శించి ఈ కార్డులను అందజేశారు. గ్రామ సర్పంచ్ గుండేటి లతీశ భూమారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, నిహారిక చేతుల మీదుగా విద్యార్థులకు మరియు ఉపాధ్యాయులకు ఐడీ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మరియు ఉపాధ్యాయ బృందం నిహారికకు శాలువాతో ఘనంగా సత్కరించి, ఆమె సామాజిక బాధ్యతను అభినందించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు తోడ్పాటునందించినందుకు గాను నిహారికకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు పిప్పర అశోక్, పాఠశాల ఉపాధ్యాయులు డాక్టర్ పతాని గంగాధర్, జి. రవీందర్, శ్రీధర్ రావు, మల్కన్నా, నాగరాజు, హరిత, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సిద్దు జన్మదిన వేడుకలు

మహేశ్వరం,నవంబర్ 10,(ప్రజా కలం)

మహేశ్వరం కందుకూరు మండలానికి చెందిన విశ్వంభర, వి3 న్యూస్ రిపోర్టర్ నాగేష్ తనయుడు సిద్దు జన్మదిన వేడుకలు మంగళవారం మహేశ్వరం మండల కేంద్రంలో కుటుంబ సభ్యుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా తల్లిదండ్రులు సిద్దుకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ కేక్ తినిపించి ఆశీర్వదించారు. కుటుంబ సభ్యుల ఆనందోత్సాహాల మధ్య వేడుకలు ఆత్మీయంగా జరిగాయి.సిద్దు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని పలువురు ఆకాంక్షించారు. బర్త్‌డే వేడుకల్లో నాగేష్, జ్యోతి, సాయి మని, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయి సెపక్ తక్రా పోటీలకు గజ్వేల్ విద్యార్థుల ఎంపిక

గజ్వేల్, నవంబర్ 10 (ప్రజా కలం ప్రతినిధి)

మల్లన్నసాగర్ ముంపు గ్రామాల నిర్వాసితుల కోసం గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన ఆర్ అండ్ ఆర్ కాలనీలోని జడ్.పి.హెచ్.ఎస్. పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు



రాష్ట్రస్థాయి సెపక్ తక్రా పోటీలకు ఎంపికయ్యారు.పాఠశాలకు చెందిన జి.కావేరి,జి.శ్యాం కిషోర్, జి.రాహుల్,ఏ.భూలక్ష్మి, జి.లాస్య, మీనాక్షి ఉమ్మడి మెదక్ జిల్లా స్థాయిలో నిర్వహించిన సెపక్ తక్రా పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు.ఈ నెల 12 నుంచి 14వ తేదీ వరకు జనగామలో నిర్వహించనున్న 70వ ఎస్జీఎఫ్ రాష్ట్రస్థాయి సెపక్ తక్రా పోటీల్లో విద్యార్థులు పాల్గొననున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.డి. కరీముద్దీన్ తెలిపారు.విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ సీహెచ్. ప్రశాంత్ హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయ బృందం,అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు అభినందించారు.

భూ వివాదాలకు శాశ్వత పరిష్కారమే భూభారతి రీసర్వే లక్ష్యం.

పారదర్శకమైన డిజిటల్ భూ రికార్డుల రూపకల్పన.

రీసర్వేకు రైతులు సహకరించాలి: ఆర్డీవో చంద్రకళ.

దుబ్బాక ప్రజాకలం నవంబర్ 10.

భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు, భూమి రికార్డుల్లో నమోదైన విస్తీర్ణానికి క్షేత్రస్థాయిలో ఉన్న భూమికి మధ్య వ్యత్యాసాలు లేకుండా పారదర్శకమైన డిజిటల్ రికార్డులు రూపొందించడమే భూభారతి భూ రీసర్వే లక్ష్యమని గజ్వేల్ ఆర్డీవో చంద్రకళ తెలిపారు. మంగళవారం రాయపోల్ మండలం ఆరేపల్లి గ్రామంలో భూభారతి భూ రీసర్వే పైలట్ ప్రాజెక్టుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సిద్దిపేట జిల్లాలో రెండో విడతలో భాగంగా రాయపోల్ మండలంలోని ఆరేపల్లి, ఎల్కల్ గ్రామాలను రీసర్వేకు ఎంపిక చేసినట్లు తెలిపారు. రీసర్వే ద్వారా ప్రతి రైతు భూమికి సంబంధించిన స్పష్టమైన డిజిటల్ మ్యాప్ రూపొందుతుందని, భవిష్యత్తులో భూ సరిహద్దులు, విస్తీర్ణంపై వివాదాలు తలెత్తకుండా ఉంటాయని వివరించారు. ఉంటాయని వివరించారు. నిజాం పాలన కాలంలో రాష్ట్రంలో సమగ్ర భూ సర్వే జరిగిందని, ఆ తర్వాత పూర్తిస్థాయిలో సర్వే నిర్వహించలేదని పేర్కొన్నారు. ప్రస్తుతం చేపడుతున్న రీసర్వే విజయవంతం కావాలంటే రైతుల భాగస్వామ్యం కీలకమని అన్నారు. భూముల కొలతల సమయంలో రైతులు తమ భూ పత్రాలను అందుబాటులో ఉంచుకొని అధికారులకు సహకరించాలని కోరారు. రైతుల సహకారంతో రీసర్వే ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, తహసీల్దార్ కృష్ణమోహన్, ఆర్ఐ రాజమల్లు, సర్పంచ్ కర్రోళ్ల దివ్యకృష్ణ, సర్వేయర్ సిద్ధార్థ, లైసెన్స్ సర్వేయర్ శేఖర్, జీపీఓ ప్రభాకర్, ఉపసర్పంచ్ వీరేష్, వార్డు సభ్యులు, రైతులు పాల్గొన్నారు.



రాజ్యాంగ విలువలను గౌరవిస్తూ,

బాధ్యత గల పౌరులుగా ఎదగాలి

- ఘనంగా 'హక్కులు-బాధ్యతలు' అవగాహన సదస్సు - సర్పంచ్ పుప్పాల నరేష్ పిలుపు

నిజామాబాద్,
(ప్రజా కలం ప్రతినిధి) నవంబర్ 10:

స్థానిక గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో పాఠశాల స్థాయిలో "హక్కులు – బాధ్యతలు మరియు రాజ్యాంగ విలువలు – పౌరుల సమానత్వం" అనే అంశంపై ప్రత్యేక అవగాహన సదస్సును ఘనంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్, న్యాయవాది పుప్పాల నరేష్ ముఖ్య అతిథిగా హాజరై, సదస్సును ప్రారంభించారు.

ఈ సందర్భంగా సర్పంచ్ పుప్పాల నరేష్ మాట్లాడుతూ.. రాజ్యాంగం మనకు కల్పించిన హక్కులతో పాటు బాధ్యతలు కూడా అంతే ముఖ్యమైనవని, ఎట్టి పరిస్థితుల్లోనూ బాధ్యతలను విస్మరించకూడదని స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ రాజ్యాంగానికి



లోబడి జీవిస్తూ, చట్టాలను గౌరవించాలని పిలుపునిచ్చారు. నేటి బాలబాలికలే రేపటి భావి భారత పౌరులని, విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన ఉత్తమ నడవడికను అలవర్చుకోవాలని హితవు పలికారు.

విద్యార్థులు ఉన్నత చదువులు చదివి, భవిష్యత్తులో గొప్ప వ్యక్తులుగా ఎదగాలని, తమ తల్లిదండ్రులతో పాటు గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. దేశంలోనే మన గ్రామం ఆదర్శంగా నిలిచేలా విద్యార్థులు తమ వంతు కృషి చేయాలని ఉత్సాహపరిచారు.

చిన్నతనం నుంచే రాజ్యాంగ విలువలను అలవర్చుకోవడం వల్ల విద్యార్థులలో దేశభక్తి, సామాజిక స్పృహ పెంపొందుతాయని ఆయన పేర్కొన్నారు.

సర్పంచ్ పుప్పాల నరేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో హెచ్ఎం, ఎంఈఓ సమ్మిరెడ్డి, గ్రామ పంచాయతీ కార్యదర్శి బాస నరేందర్, ఉపసర్పంచ్ సదానంద్, పాలకవర్గ సభ్యులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు మరియు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

తల్వేదలో గ్రామకంఠం భూమి, దళితుల దారి కబ్జా

జేఏసీ ఆధ్వర్యంలో జాయింట్ కలెక్టర్‌కు ఫిర్యాదు



నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) నవంబర్ 10: నిజామాబాద్ జిల్లా నందిపేట్ మండలంలోని తల్వేద గ్రామంలో గ్రామకంఠం భూమి కబ్జాకు గురైందని, దళితవాడకు వెళ్లే దారిని మూసివేసి అక్రమంగా ప్రహరీ గోడ నిర్మించారని బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ నాయకులు ఆరోపించారు. ఈ విషయమై మంగళవారం జేఏసీ ఆధ్వర్యంలో గ్రామస్థులు జిల్లా జాయింట్ కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, గతంలో తల్వేద గ్రామంలో పట్వారిగా పని చేసిన గడ్డం గంగారెడ్డి అనే వ్యక్తి గ్రామం నడిబొడ్డున ఉన్న సుమారు ఎకరన్నర గ్రామకంఠం భూమిని తన పేరు మీద అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారని తెలిపారు. అక్కడ ఉన్న కాక్కయ్య దేవాలయాన్ని సైతం కబ్జా చేసి అక్రమంగా రైస్ మిల్లును ప్రారంభించారని మండిపడ్డారు. దళితవాడకు వెళ్లే రోడ్డును కూడా సదరు రైస్ మిల్లు ఆవరణలో కలుపుకుంటూ చుట్టూ ప్రహరీ గోడ నిర్మించారని ఆవేదన వ్యక్తం చేశారు. నివాసాల మధ్య ఉన్న ఈ రైస్ మిల్లు వల్ల వచ్చే కాలుష్యంతో స్థానికులు తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నారని, వెంటనే ఆ మిల్లును, ప్రహరీ గోడను తొలగించి దళితుల దారిని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

గ్రామస్థుల ఫిర్యాదుపై జాయింట్ కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. వారం రోజుల్లోగా అక్రమ నిర్మాణాలను తొలగించి గ్రామస్థులకు పూర్తి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కాగా, ఇచ్చిన మాట ప్రకారం వారం రోజుల్లో అధికారులు స్పందించకుంటే బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ ఆధ్వర్యంలో భారీ ఎత్తున ధర్నా నిర్వహిస్తామని నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ నాయకులు సుమన్, ప్రేమ్, మహిపాల్, కిరణ్, ఉమేష్, మహేష్, భుమేష్, గోపి, ఆమ్ ఆద్మీ పార్టీ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్చార్జ్ సయ్యద్ ఆవేజ్ మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.



అనుచిత వ్యాఖ్యలు వెనక్కి తీసుకుని బహిరంగ క్షమాపణ చెప్పాలి.

దుబ్బాక ప్రజాకలం నవంబర్ 10.

దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డిపై బీఆర్ఎస్ నాయకులు రాజిరెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకుని బహిరంగంగా క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జాల దుర్గాప్రసాద్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గొల్లపల్లి కనకయ్య డిమాండ్ చేశారు. చిన్నపిల్లలను రాజకీయాల్లోకి లాగి విమర్శలు చేయడం సరికాదని హితవు పలికారు. చెరుకు శ్రీనివాస్ రెడ్డి కుటుంబం మచ్చలేని కుటుంబమని, అలాంటి కుటుంబంపై అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని పేర్కొన్నారు. ఇప్పటికైనా రాజిరెడ్డి తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు ఉషణగాళ్ల స్వామి, మండల ప్రధాన కార్యదర్శి నర్సింలు, మహాజన సోషలిస్ట్ పార్టీ అధ్యక్షులు నరసింగరావు, సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షుడు పడాల రాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి గణేష్ పంచమి, జిల్లా కార్యదర్శి ఇప్ప మల్లేశం, రాజకొండ యాదగిరి అనాజిపురం, మైనార్టీ సెల్ జిల్లా నాయకులు యూసుఫ్, కొత్తపల్లి ఎల్లం, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు

కమ్మర్‌పల్లిలో '108' సిబ్బందికి లయన్స్ క్లబ్ ఘన సత్కారం



నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) నవంబర్ 10:

ఆపద సమయంలో నిస్వార్థంగా సేవలందిస్తూ, ఎంతోమంది ప్రాణాలను కాపాడుతున్న '108' అత్యవసర వైద్య సేవల సిబ్బందిని నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి మండలంలోని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సత్కరించారు. స్థానిక 108 సిబ్బంది అయిన ఈఎంటీలు కొత్తపల్లి సాగర్, సుంకరి విజయ్ కుమార్, పైలట్ తలారి రమేష్‌లకు క్లబ్ ప్రతినిధులు శాలువాలు కప్పి, మెమెంటోలు, ప్రశంసా పత్రాలను అందజేసి పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షుడు తెడ్డు రమేష్ మాట్లాడుతూ.. రాత్రింబవళ్లు అనే తేడా లేకుండా, ఎలాంటి విపత్కర పరిస్థితుల్లోనైనా ప్రాణాపాయ స్థితిలో ఉన్న బాధితులకు తక్షణ వైద్య సేవలు అందిస్తూ, సకాలంలో ఆసుపత్రులకు చేర్చి ప్రాణాలు కాపాడటంలో 108 సిబ్బంది చేస్తున్న సేవలు వెలకట్టలేనివని కొనియాడారు. ప్రజల ప్రాణాలను కాపాడటమే లక్ష్యంగా విధులు నిర్వహిస్తున్న ఈఎంటీలు, పైలట్ల సేవలను గుర్తించి గౌరవించడం సమాజ బాధ్యత అని పేర్కొన్నారు.

ఇలాంటి సత్కారాలు సిబ్బందిలో మరింత సేవాభావాన్ని, ఉత్సాహాన్ని నింపుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జిల్లా ఛైర్పర్సన్ లుక్కా గంగాధర్, కమ్మర్‌పల్లి లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షుడు సున్నం మోహన్, మార్కెట్ కమిటీ తాజా మాజీ అధ్యక్షుడు పాలేపు నర్సయ్య, కార్యవర్గ సభ్యులు బద్దం రాజశేఖర్, చింత ప్రదీప్, పిప్పేరా అనిల్, సూరంగి చంద్రశేఖర్, చిలివేరి పవన్, హెచ్ఎం కనక గంగాధర్, కొమ్ముల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



నేల ఆరోగ్య పరిరక్షణతోనే అధిక దిగుబడులు.

ఖేత్ బచావో అభియాన్‌లో రైతులకు అవగాహన.

దుబ్బాక ప్రజాకలం నవంబర్ 10.

రైతులు నేల ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ భూసారాన్ని పెంపొందించినప్పుడే తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించవచ్చని ఐసీఏఆర్ ప్రధాన శాస్త్రవేత్త డా. ఎం. శాంత లక్ష్మి అన్నారు. మంగళవారం రాయపోల్ మండలం బేగంపేట గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఖేత్ బచావో అభియాన్' కార్యక్రమంలో ఆమె పాల్గొని రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి రైతు తప్పనిసరిగా నేల పరీక్షలు చేయించుకొని, వాటి ఫలితాల ఆధారంగా సమతుల్యంగా ఎరువులు వినియోగించాలని సూచించారు. రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ, జీవ ఎరువుల వినియోగాన్ని పెంచాలని తెలిపారు. విత్తనాలు విత్తే ముందు శుద్ధి చేయడం ద్వారా తెగుళ్లను నివారించి, మొలక శాతాన్ని పెంచుకోవచ్చన్నారు. గజ్వేల్ సహాయ వ్యవసాయ సంచాలకులు బాబు నాయక్ మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో రబీ పంటలకు వర్షపాతం తగ్గి, ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉందన్నారు. రైతులు తక్కువ నీటితో సాగయ్యే పంటలను ఎంచుకొని, బిందు, తుంపర సేద్య పద్ధతుల ద్వారా నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఆర్. నరేష్, గ్రామ సర్పంచ్ గీతా ప్రవీణ్, ఉపసర్పంచ్ స్వామి, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

రాములు నాయక్ జీ ముంబై ఉద్యమకారుల సభకు రావాలని విజ్ఞప్తి

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) నవంబర్10:

శుక్రవారం 13న, ముంబై భివండి నవీముంబై సూరత్ తెలంగాణ ఉద్యమకారుల సభ హైద్రాబాద్లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేశారు. అట్టి సమావేశానికి కెకె కమిటి సభ్యులు రాములు నాయక్ హాజరు కావాలని ముంబై తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ (ఎంటిజెఏసి) వైస్ చైర్మన్ కాసుల నర్సింహ గౌడ్ టీం ప్రత్యక్షంగా కల్సి వినతి పత్రం అందజేశారు. మొన్న మరో కెకె కమిటి మెంబర్ శోభన్ రెడ్డికి కూడా వినతి చేశారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం ఏర్పరచిన కెకె కమిటి ద్వారా తమకు సమ న్యాయం జరగాలని అందులో కోరారు. దానికి రాములు సానుకూలంగా స్పందిస్తూ తప్పకుండా సభకు వస్తానని ముంబై ప్రతినిధులకు హామీ ఇచ్చారు.



రాష్ట్రేతరులు తెలంగాణ సాధనకు క్రియాశీల పాత్ర పోషించిన విషయం అందరికి తెల్సిందే. అయితే వలసజీవులైన ఉద్యమకారులు హైద్రాబాద్ సభకు సమాయత్తం అవుతున్నారు.



లోన్ యాప్ వేధింపులు తట్టుకోలేక కానిస్టేబుల్ ఆత్మహత్య

- రూ.40 వేల అప్పు కోసం వేధింపులు

- కానిస్టేబుల్ కుటుంబంలో తీరని విషాదం

- తల్లి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు



మహేశ్వరం, నవంబర్ 10,(ప్రజా కలం)

చిన్న మొత్తంలో తీసుకున్న ఆన్‌లైన్ రుణం ఓ కుటుంబంలో తీరని విషాదాన్ని మిగిల్చింది. రుణం చెల్లించాలంటూ లోన్ యాప్ నిర్వాహకులు పెట్టిన తీవ్ర ఒత్తిడి, నిరంతర ఫోన్ కాల్స్, కుటుంబ గౌరవాన్ని లక్ష్యంగా చేసుకుని చేసిన బెదిరింపులు ఇప్పుడు తీవ్ర కలకలం రేపుతున్నాయి మహేశ్వరం నియోజ కవర్గం మంఖల్ జిహెచ్ఎంసి పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న శ్రీను నాలుగు నెలల క్రితం ఓ ఆన్‌లైన్ లోన్ యాప్ ద్వారా రూ. 40 వేల రుణం తీసుకున్నట్లు తెలుస్తోంది. సకాలంలో చెల్లించలేకపోవడంతో అక్కడి నుంచి వేధింపులు మొదలయ్యాయని కుటుంబ సభ్యులు చెబుతున్నారు.

గంటకోసారి ఫోన్.. భయపెట్టే మెసేజ్‌లు

డబ్బు వెంటనే చెల్లించాలంటూ గంటకోసారి ఫోన్ చేసి ఒత్తిడి తెచ్చినట్లు ఆరోపణలు ఉన్నాయి.

అంతేకాకుండా అప్పు చెల్లించకపోతే కుటుంబ సభ్యులు, గ్రామస్థ లకు అసభ్యకరమైన చిత్రాలు పంపిస్తామంటూ బ్లాక్‌మెయిల్ చేసినట్లు సమాచారం. భార్యకు సంబంధించిన వ్యక్తిగత చిత్రాలను వంపిస్తామంటూ కూడా బెదిరించినట్లు కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ నిరంతర వేధింపులతో మానసికంగా తీవ్ర ఒత్తిడికి గురైన శ్రీను ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటన కుటుంబంలోనే కాకుండా పోలీస్ శాఖలోనూ తీవ్ర విషాదాన్ని నింపింది.

పోలీసుల దర్యాప్తు

ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఫోన్ కాల్స్, బెదిరింపుల వెనుక ఉన్న వ్యక్తులు ఎవరు? ఏ యాప్ ద్వారా రుణం ఇచ్చారు? నిర్వాహకుల పాత్ర ఏంటి? అనే కోణంలో విచారణ జరుపుతున్నారు.రూ. 40 వేల రుణం వసూలు పేరుతో ఇంతటి వేధింపులకు పాల్పడటంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. డిజిటల్ రుణాల పేరుతో సాగుతున్న ఇలాంటి వేధింపులకు అడ్డుకట్ట వేసేందుకు కఠిన చర్యలు తీసుకోవాలనే డిమాండ్ బలంగా వినిపిస్తోంది.

తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షురాలుగా

రెండోసారి సుగుణ రాజేష్ రెడ్డి నియామకం

రాష్ట్ర నూతన కార్యవర్గంలో మరోసారి కీలక బాధ్యతలు

మహేశ్వరం, నవంబర్ 10,(ప్రజా కలం)

తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ నూతన కార్యవర్గంలో సుగుణ రాజేష్ రెడ్డికి మరోసారి రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా అవకాశం కల్పించారు.



ఆమెను రెండోసారి రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా నియమిస్తూ కాంగ్రెస్ అధిష్టానం నిర్ణయం తీసుకుంది.ఈ సందర్భంగా సుగుణ రాజేష్ రెడ్డి మాట్లాడుతూ.. రెండోసారి తనపై నమ్మకం ఉంచి రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా బాధ్యతలు అప్పగించిన కాంగ్రెస్ అధిష్టానానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.తనకు ఈ బాధ్యత మరోసారి అప్పగించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. మహిళా కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేయడంతో పాటు మహిళల అభ్యున్నతి, హక్కుల సాధన, మహిళా సాధికారత కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. పార్టీ అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి మరింత బాధ్యతతో పనిచేస్తానని సుగుణ రాజేష్ రెడ్డి పేర్కొన్నారు.రెండోసారి రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా అవకాశం దక్కడం పట్ల ఆమె అనుచరులు, పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రూ.50 లక్షలతో బాక్స్ డ్రైన్ నిర్మాణ

పనులు ప్రారంభం

కాలనీ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం..

పెండింగ్ పనులు త్వరలో పూర్తి చేస్తాం

: మాజీ కార్పొరేటర్ ప్రేమ్ కుమార్

మల్కాజిగిరి, నవంబరు 10 (ప్రజా కలం ప్రతినిధి): ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ పరిధిలోని సత్తిరెడ్డి నగర్‌లో సుమారు రూ. 50 లక్షల వ్యయంతో చేపట్టనున్న బాక్స్ డ్రైన్ నిర్మాణ పనులను మాజీ కార్పొరేటర్ వై. ప్రేమ్ కుమార్ కాలనీ అసోసియేషన్ సభ్యులతో కలిసి ప్రారంభించారు.



స్థానికంగా డ్రైనేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారం కల్పించాలనే లక్ష్యంతో ఈ నిర్మాణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు.

ఈ సందర్భంగా ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ.. మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు సహకారంతో డివిజన్‌లో పలు అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. డివిజన్ పరిధిలో ఇంకా పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను కూడా సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ త్వరలోనే పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బాబు, సత్యనారాయణ, సంపత్ రావు, కిషోర్, కాలనీ వాసులు శ్రీనివాస్ రెడ్డి, తిరుపతి రెడ్డి, బల్వంత్ రెడ్డి, రాములు గౌడ్, వినాయకరావు, స్వామినాథన్, సురేందర్, సునీల్, డేవిడ్, అశోక్ కుమార్, మహేందర్, రవి తదితరులు పాల్గొన్నారు.

ఏఐ అనిశ్చితికి రఫ్ సెట్ అస్త్రం!..


గీతంలో నిపుణుల కార్యశాల..

ఆధునిక సాంకేతికతపై పరిశోధకులకు అవగాహన..

పటాన్‌చెరు,నవంబర్ 10 (ప్రజా కలం) ప్రతినిధి

కృత్రిమ మేధస్సు, సమాచార విశ్లేషణ రంగాల్లో అనిశ్చితిని అధిగమించి, కచ్చితమైన నిర్ణయాలు తీసుకునే వినూత్న పరిశోధన విధానాలపై గీతం విశ్వవిద్యాలయంలో ప్రత్యేక కార్యశాల నిర్వహించారు.రఫ్ సెట్ సిద్ధాంతం ప్రాముఖ్యత, ఆధునిక సాంకేతిక రంగాల్లో దాని వినియోగంపై నిపుణులు అవగాహన కల్పించారు. గీతం విజ్ఞాన శాస్త్ర పాఠశాల గణిత, గణాంక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో మంగళవారం ప్రొఫెసర్ జిడ్జిస్లావ్ పావ్లాక్ శతజయంతిని పురస్కరించుకుని ఈ కార్యశాలను ఏర్పాటు చేశారు. హైదరాబాద్ విశ్వవిద్యాలయం మాజీ సీనియర్ ప్రొఫెసర్ సి.ఆర్. రావు, ప్రొఫెసర్ సల్మాన్ అబ్దుల్ మోయిజ్, ఎంజీఐటీ కంప్యూటర్ శాస్త్ర విభాగాధిపతి ప్రొఫెసర్ టి.వి. రజనీకాంత్ పాల్గొని రఫ్ సెట్ సిద్ధాంతం గణిత పునాదులు,ఆధునిక అనువర్తనాలను వివరించారు.యంత్ర అభ్యసనం,సమాచార విశ్లేషణ,అవసరమైన అంశాల ఎంపిక, తెలివైన నిర్ణయాల రూపకల్పన వంటి అంశాలపై సాంకేతిక ప్రవనంగాలు నిర్వహించారు.అధ్యాపకులు, పరిశోధకులు,ఉన్నత విద్యార్థులు పాల్గొని నిపుణులతో తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు..





ఓటర్లకు మరో అవకాశం కల్పించడంలో

కాంగ్రెస్ పోరాటం సఫలం

- ఈ నెల 21 వరకు దరఖాస్తులకు గడువు..

అర్హులు వినియోగించుకోవాలి: లక్ష్మీకాంత్ రెడ్డి

మల్కాజిగిరి, నవంబరు 10 (ప్రజా కలం ప్రతినిధి): ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో ఓటు హక్కు కోల్పోయిన అర్హులైన పౌరులకు మరో అవకాశం కల్పించాలన్న కాంగ్రెస్ పార్టీ పోరాటం ఫలించిందని మల్కాజిగిరి నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుడు లక్ష్మీకాంత్ రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ పార్టీ చేసిన విజ్ఞప్తులు, పోరాటం నేపథ్యంలో ఎన్నికల కమిషన్ స్పందించి ఓటర్ల జాబితాలో పేర్లు నమోదు చేసుకునేందుకు ఈ నెల 21వ తేదీ వరకు గడువు కల్పించిందని పేర్కొన్నారు.

ఆనంద్‌బాగ్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాజ్యాంగం ప్రసాదించిన ఓటు హక్కును కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీ ప్రజల తరపున ఢిల్లీ వరకు వెళ్లి పోరాటం చేసిందన్నారు. మెదక్, మల్కాజిగిరి ప్రాంతాల నుంచి సుమారు 100 కార్లలో నాయకులు, కార్యకర్తలు ఢిల్లీకి చేరుకుని ఎన్నికల కమిషన్ దృష్టికి ఓటర్ల సమస్యలను తీసుకెళ్లారని తెలిపారు. ఈ పోరాటానికి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ అందించిన నాయకత్వం, సహకారం ఎంతో కీలకమని వివరించారు.నివాస ప్రాంతాలు మారిన కారణంగా ఓటర్ల జాబితా నుంచి పేర్లు తొలగించబడిన వారు, ఒకటి కంటే ఎక్కువ ప్రాంతాల్లో ఓట్లు నమోదయ్యాయనే కారణంతో ఓటు హక్కు కోల్పోయినవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటర్ల జాబితాలో తమ పేరు ఉందో లేదో పరిశీలించుకోవాలని సూచించారు. పేరు లేని వారు అవసరమైన గుర్తింపు, నివాస ధ్రువీకరణ పత్రాలతో సంబంధిత ఎన్నికల అధికారులను సంప్రదించి ఈ నెల 21లోగా దరఖాస్తు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత కీలకమని, అర్హులైన ప్రతి పౌరుడికి ఆ హక్కు దక్కాలన్నదే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని లక్ష్మీకాంత్ రెడ్డి స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ పోరాటం ద్వారా లభించిన ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకుని తమ ఓటు హక్కును పరిరక్షించుకోవాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో మాజీ కార్పొరేటర్ వై. ప్రేమ్ కుమార్, బీ బ్లాక్ అధ్యక్షుడు వెంకటేశ్ యాదవ్, బీకే శ్రీనివాస్, గుండా నిరంజన్, సతీష్ కుమార్, పిట్టల శ్రీనివాస్, అశోక్ రెడ్డి, రాందాస్, సంతోష్ ముదిరాజ్, డివిజన్ అధ్యక్షులు జీడి సంపత్ గౌడ్, వినోద్ యాదవ్, సత్యమూర్తి, పిట్టల నాగరాజు, రాఘవన్, శ్రీకాంత్ ముదిరాజ్, లక్ష్మి, ఆశా, కుట్టి శ్రీనివాస్ యాదవ్, బాబు, సత్యనారాయణ, సంపత్ రావు, కపిల్, పార్థసారథి, బాలరాజు యాదవ్, బ్రహ్మయ్య, పరమేశ్, రాము, కిషోర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాణసంచా కాల్చి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు.

కాంగ్రెస్‌పై బీజేపీ ఫైర్..

- మూడేళ్ల పాలనలో తట్టెడు మట్టి కూడా తీయలేదు.. గోదావరి అంజిరెడ్డి ధ్వజం..

-శివనగర్, పెద్ద కంజర్ల రోడ్డు నిర్మించకుంటే ఆందోళనలు ఉద్ధృతం చేస్తామని హెచ్చరిక..

పటాన్‌చెరు, నవంబర్ 10 (ప్రజా కలం) ప్రతినిధి

శివనగర్ నుంచి పెద్ద కంజర్ల వరకు రోడ్డు నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఆధ్వర్యంలో నిరసన దీక్ష చేపట్టారు. ఈ దీక్షలో ముఖ్య అతిథిగా పాల్గొన్న బీజేపీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి దాదాపు మూడేళ్లు గడుస్తున్నా పటాన్‌చెరు నియోజకవర్గంలో కనీస అభివృద్ధి పనులు చేపట్టలేదని, కనీసం తట్టెడు మట్టి కూడా తీయలేదని విమర్శించారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలోనూ నియోజకవర్గం అభివృద్ధికి నోచుకోలేదని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు విస్మరించాయని ధ్వజమెత్తారు. అధ్వానంగా మారిన రోడ్లతో స్థానికులు, పాఠశాల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా ప్రభుత్వాలకు పట్టడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలను పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వానికి కూడా గత బీఆర్ఎస్ ప్రభుత్వానికి పట్టిన గతే పడుతుందని హెచ్చరించారు.శివనగర్,పెద్ద కంజర్ల రోడ్డు నిర్మాణానికి తక్షణమే నిధులు మంజూరు చేయాలని, లేనిపక్షంలో ప్రజలను సమీకరించి ఆందోళనలను మరింత ఉద్ధృతం చేస్తామని గోదావరి అంజిరెడ్డి ప్రభుత్వాన్ని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో బీజేపీ జిన్నారం మున్సిపాలిటీ అధ్యక్షుడు జగన్ రెడ్డి, వైస్ చైర్మన్ ప్రతాప్ రెడ్డి, స్థానిక బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు..



Corporate .Office :1-7-511/4, Gemini Colony, Near Pochamma Temple, Zamistanpur, HYDERABAD, TELANGANA, 500020 Cell: 9010972526

Printed, Published and owned by **KALAKONDA RAMAKRISHNA**, Printed at **TEJOMAI PUBLICATION**, H.No. 2-24/98/BLN Colony, IDA Uppal Medchal-Malkajgiri, Hyderabad, Telangana-50013
Published from H.No.10-1-7, Bada Bazar, Beside Pothalingaiah Temple, Azam Raod, Nizamabad,Telangana -503001
Editor: **KALAKONDA RAMAKRISHNA**, **PRGI.No. TELTEL/2010/33275,** Cell: 90109 72526, Email:prajakalam2010@gmail.com